నమస్తే హైదరాబాద్

మీ గళం.. మా కలం...

NAMASTHE HYDERABAD

తెలుగు దిన పత్రిక

RNI No: APTEL/2012/45237

రంగారెడ్డి Rangareddy | ఆదివారం 15-11-2026 SUNDAY 15-11-2026 | సంపుటి: 15 Volume: 15 | సంచిక: 155 Issue : 155 | పేజీలు : 8 Page's: 8 | వెల: 3/- Rs: 3/-

మంచి మాట

ఎదుటివారు నీలో తప్పులు చూపారని తల్లడిల్లిపోకు. నీకు మంచే చేశారని భావించి, తప్పులు సరిచేసుకుని తల పైకెత్తుకుని తిరుగు.

భారత్ సమ్మిట్‌పై కిషన్ రెడ్డి ఫైర్

దేశ వ్యతిరేక శక్తులను పిలిచారంటూ విమర్శలు



హైదరాబాద్, (నమస్తే హైదరాబాద్) తెలంగాణ రాష్ట్ర రాజధాని కేంద్రంగా నవంబర్ 12 నుంచి 14 వరకు జరిగిన భారత్ సమ్మిట్ కార్యక్రమంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు.'భారత్ సమ్మిట్‌తో తెలంగాణకు ఏం ప్రయోజనం చేకూరింది. తెలంగాణను విమర్శించేందుకే సమ్మిట్ ఏర్పాటు చేశారా?.. దేశ వ్యతిరేక శక్తులను సమ్మిట్‌కు పిలిచారు. ప్రపంచ దేశాల ముందు భారత ఎన్నికల వ్యవస్థను చిన్నతనం చేస్తూ మాట్లాడారు. దేశంలో వ్యవస్థలన్నీ కుప్పకూలినట్లు రాహుల్ మాట్లాడారు. ఎమర్జెన్సీ సమయంలో ఎన్నికలు ఏ తరహాలో జరిగాయో అందరికీ తెలుసు. బీజేపీ ముఖ్య నాయకులను ఆ టైమ్‌లో జైల్లో పెట్టారు. మీరా ఎన్నికల వ్యవస్థ గురించి మాట్లాడేది. మేం అధికారంలోకి వచ్చాక ఉగ్రవాదులను అణిచివేశాం' అంటూ భారత్ సమ్మిట్‌పై కిషన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు.

తెలంగాణ గిగ్ వర్కర్లకు గుడ్‌న్యూస్..

రూ.5 లక్షల బీమా, రూ.10 లక్షల వైద్యం

- సంక్షేమ పథకాన్ని రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి కలిసి ప్రారంభం
- ఈ పథకం కింద రూ.5 లక్షల జీవిత బీమా
- రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం
- హైదరాబాద్‌లో జరిగిన సభకు ముందు గిగ్ వర్కర్ల భారీ బైక్ ర్యాలీ



హైదరాబాద్: (నమస్తే హైదరాబాద్) తెలంగాణలో గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. వారికి రూ.5 లక్షల జీవిత బీమాతో పాటు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం అందించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లోని జయభేరీ గ్రౌండ్స్‌లో శనివారం నిర్వహించిన సభలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో కలిసి 'తెలంగాణ గిగ్ వర్కర్ల సామాజిక భద్రత, సంక్షేమ పథకం' విధివిధానాలను ఆయన ప్రారంభించారు. మిగతా 2లో...

రాహుల్ గాంధీ హామీలన్నీ గాలి మాటలే

- గిగ్ వర్కర్లకు ఆరోగ్య భద్రత కల్పిస్తామనడం పెద్ద జోక్ అంటూ బండి సంజయ్ ఎద్దేవా
- కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారంటీలు గాలి మూటలుగా మిగిలిపోయాయని విమర్శ



హైదరాబాద్ (నమస్తే హైదరాబాద్) గతంలో ఇచ్చిన వరంగల్, కామారెడ్డి డిక్లరేషన్ల అమలు ఏమైందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ హైదరాబాద్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించిన గిగ్ వర్కర్ల సంక్షేమ పథకంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ నోట పలికేవన్నీ గాలి మాటలేనని ఆయన విమర్శించారు. గిగ్ వర్కర్లకు ఆరోగ్య భద్రత కల్పిస్తామని రాహుల్ గాంధీ చెప్పడం పెద్ద జోక్ అని ఎద్దేవా చేశారు. శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన బండి సంజయ్, కాంగ్రెస్ పార్టీ తీరుపై నిప్పులు చెరిగారు. ఎన్నికల సమయంలో ప్రజలకు మిగతా 2లో...

కేంద్రం, ఎన్నికల సంఘం,

అదానీపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు



హైదరాబాద్, (నమస్తే హైదరాబాద్) హైదరాబాద్ వేదికగా జరిగిన ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ సద స్సు 'భారత్ సమ్మిట్ 2026' ముగింపు కార్యక్రమంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పాల్గొని ప్రసంగించారు. 2014 తర్వాత దేశ రాజకీయాల్లో వచ్చిన మార్పులు, ఎన్నికల వ్యవస్థ, ఆర్థిక విధానాలపై ఆయన కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమ ంలో రాహుల్ గాంధీ దేశంలో జరుగుతోన్న పలు అంశాల్ని స్పృశించారు. 2014లో దేశంలో జరిగిన ఎన్నికలు అంతకుముం దు జరిగిన ఎన్నికలకంటే పూర్తిగా భిన్నమైనవని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఆ ఎన్నికల సమయ ంలో మిలియన్ల కొద్దీ డబ్బు రాజకీయాల్లోకి ప్రవహించిందని, అది దేశ రాజకీయ ముఖచిత్రాన్నే పూర్తిగా మార్చివేసిందని అన్నా రు. దేశంలో విపరీతమైన నగదు ప్రవాహం (లిక్విడిటీ) కారణంగా రాజకీయ వ్యవస్థ మొత్తం భ్రష్టుపట్టిపోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల మిగతా 2లో...

విదేశాల్లో భారత ప్రతిష్టను రాహుల్ గాంధీ

దెబ్బతీస్తున్నారు

దేశంలో ప్రజాస్వామ్యం లేకపోతే రాహుల్ పాదయాత్ర ఎలా సాధ్యమైందన్న ఈటల

ఎన్నికల మేనిఫెస్టో హామీలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం విస్మరించిందని విమర్శ



హైదరాబాద్ (నమస్తే హైదరాబాద్) రైతుల రుణమాఫీ, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెం ట్‌ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలపై మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటల రాజే ందర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దేశ ప్రతిష్టను దిగజార్చేలా రాహుల్ గాంధీ వ్యవహరిస్తున్నారని, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం నియంతృత్వ పోకడలతో ప్రజల ఉసురు పోసుకుంటోందని మండిపడ్డా రు.విదేశీ గడ్డపై భారత ఎన్నికల వ్యవస్థను, సుప్రీంకోర్టును రాహుల్ గాంధీ అపహాస్యం చేస్తున్నారని ఈటల ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ మాటలు, తీరు బాధ్యతా యుతమైన ప్రతిపక్ష మిగతా 2లో...

తెలంగాణ ప్రజలకు రాహుల్ గాంధీ

సమాధానం చెప్పాలి

- హైదరాబాద్ పర్యటనలో ఉన్న ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని నిలదీసిన కేటీఆర్
- కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో అబద్ధాల పుట్ట అంటూ ఎక్స్ వేదికగా ధ్వజం
- 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారెంటీల అమలుపై సూటి ప్రశ్నలు



హైదరాబాద్ (నమస్తే హైదరాబాద్) తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రశ్నల వర్షం కురిపించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదో రాష్ట్ర ప్రజలకు రాహుల్ గాంధీ వెంటనే సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో 'అభయ హస్తం' పచ్చి అబద్ధాల పుట్ట అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజల సొమ్ముతో మిగతా 2లో...

ఇకపై ఆ ప్రాసీజర్

మెట్ల బావులకు కూడా వర్తింపజేస్తాం



హైదరాబాద్: (నమస్తే హైదరాబాద్) తెలంగాణలో చెరువుల పునరుద్ధరణకు అమలు చేస్తున్న స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్‌వోపీ)లను ఇకపై చారిత్రక మెట్ల బావుల పరిరక్షణకు కూడా వర్తింపజేయనున్నట్లు హైడ్రా (న్ణ=ూూూ) కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మెట్ల బావుల పరిరక్షణ, అవగాహన కార్యక్రమ ంలో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని భవిష్యత్తులో జాతీయ స్థాయి విధానంగా ముందుకు తీసుకెళ్లే అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.హైదరాబాద్ నగరంలో నీటి ఎద్దడి, వరద నియంత్రణ, కరవు నివారణ అంశాలపై వచ్చే మంగళవారం కేంద్ర హోంశాఖ కార్యదర్శితో సమావేశం కానున్నట్లు రంగనాథ్ మిగతా 2లో...

హైదరాబాద్‌లో నిషేధిత

ఇ-సిగరెట్ల దందా గుట్టురట్టు



హైదరాబాద్, (నమస్తే హైదరాబాద్) నగరంలో నిషేధిత ఇ-సిగరెట్ల అక్రమ వ్యాపారం గుట్టును గొల్కొండ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. గుడిమల్కాపూర్, మాదాపూర్ ప్రాంతాలను కేంద్రంగా చేసు కుని సాగుతున్న ఈ అక్రమ దందాపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ క్రమంలో నానాల్ నగర్‌లోని ఒలివ్ ఆసుపత్రి సమీపంలో ఉన్న 'స్మోక్ వాల్ట్' షాపుపై గొల్కొండ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు, గుడిమల్కాపూర్ పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించారు.చాక్లెట్లు, హుక్కా పాట్స్ విక్రయాల వ్యాపారం ముసుగులో నిషేధిత ఇ-సిగరెట్లను అక్రమంగా విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడు మిగతా 2లో...

2014 ఎన్నికల్లో భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ధ్వంసమైంది



- రెండోరోజు జరిగిన భారత్ సమ్మిట్-2026లో రాహుల్ గాంధీ పాల్గొన్నారు.
- 2014లో జరిగిన ఎన్నికలు గతంలో ఎప్పుడూ చూడలేదని వెల్లడించారు.

హైదరాబాద్: (నమస్తే హైదరాబాద్) గత పదేళ్లుగా ఫాసిస్టుల గొంతు గట్టిగా వినిపిస్తోందని లోక్?సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. మిగతా 2లో...

రాహుల్ గాంధీ నాయకత్వం కోసం దేశం ఎదురుచూస్తోంది



హైదరాబాద్, (నమస్తే హైదరాబాద్) రాహుల్ గాంధీ నాయకత్వ లక్షణాల గురించి ప్రపంచం మాట్లాడుకుంటోందని.. దేశం ఆయన నాయకత్వం కోసం ఎదురు చూస్తోందని తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖామంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ మేరకు హైదరాబాద్ వేదికగా నిర్వహించిన 'భారత్ సమ్మిట్'లో ఆయన మాట్లాడారు.తెలంగాణ రాజధాని హైదరాబాద్ వేదికగా నవంబర్ 12 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించిన 'భారత్ సమ్మిట్'లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ మేరకు ఆయన తెలంగాణ అభివృద్ధి, రాహుల్ గాంధీ నాయకత్వ లక్షణాల గురించి మాట్లాడారు. 'రాహుల్ గాంధీ నాయకత్వం మిగతా 2లో...

నమస్తే హైదరాబాద్
మీ గళం.. మా కలం...!
NAMASTHE HYDERABAD
తెలుగు దిన పత్రిక
RNI No: APTEL/2012/45237

సంపాదకీయం



ప్రత్యామ్నాయం లేని రాజకీయ శూన్యంలో భారత్!

● 80 ఏళ్ల స్వాతంత్ర్య ప్రస్థానంలో పాలకుల వైఫల్యాలు.. ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి

భారతదేశం స్వాతంత్ర్యం సాధించి ఎనిమిది దశాబ్దాలు పూర్తిచేసుకుంటున్న తరుణంలో దేశ రాజకీయ వ్యవస్థ ఎటువైపు వయనిస్తోందనే ప్రశ్న అత్యంత కీలకంగా మారింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకు విశ్వాసం కలిగించే రాజకీయ నాయకత్వం, స్పష్టమైన విధానాలు, సమర్థవంతమైన పాలన ఎంతో అవసరం. కానీ స్వాతంత్ర్యానంతరం దేశాన్ని పాలించిన వివిధ రాజకీయ పార్టీలు ప్రజల ఆకాంక్షలను పూర్తిస్థాయిలో నెరవేర్చలేకపోయాయనే విమర్శలు ఉన్నాయి. ఒక పార్టీపై అసంతృప్తి కలిగినప్పుడు మరో పార్టీకి అవకాశం ఇచ్చినా, ఆశించిన మార్పు కనిపించకపోవడంతో ప్రజలు రాజకీయ వ్యవస్థపైనే నిరాశకు గురవుతున్నారు. ఈ పరిస్థితి భారతదేశాన్ని ఒక క్లిష్టమైన రాజకీయ సందిగ్ధంలోకి నెట్టింది.స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించిన కాంగ్రెస్ పార్టీ దేశంలో సుదీర్ఘకాలం అధికారంలో కొనసాగింది. స్వాతంత్ర్యానంతరం దేశ నిర్మాణం, పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయ రంగం, విద్య, వైద్యం వంటి కీలక రంగాల్లో అనేక విధానాలను రూపొందించింది. రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థ, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి పునాదులు వేసింది. అయితే కాలక్రమంలో పాలనలో లోపాలు, అవినీతి, కుటుంబ రాజకీయాలు, నాయకత్వ సమస్యలు, ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యం వంటి పరిణామాలు ఆ పార్టీ బలహీనతకు కారణమయ్యాయి. ప్రజల్లో ఏర్పడిన అసంతృప్తిని గుర్తించి సరిదిద్దుకోవడంలో కాంగ్రెస్ విఫలమవడంతో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తులకు అవకాశం ఏర్పడింది.కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా కమ్యూనిస్టులు, సోషలిస్టులు ప్రజల ముందుకు వచ్చారు. సమానత్వం, సామాజిక న్యాయం, పేదల సంక్షేమం, కార్మికుల హక్కులు, రైతుల అభివృద్ధి వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావించారు. కొన్ని రాష్ట్రాల్లో అధికారాన్ని కూడా చేపట్టారు. అయితే జాతీయ స్థాయిలో బలమైన ప్రత్యామ్నాయంగా ఎదగలేకపోయారు. అంతర్గత విభేదాలు, సిద్ధాంతపరమైన భిన్నాభిప్రాయాలు, నాయకత్వ సమస్యలు, రాజకీయ చీలికలు వారి బలాన్ని తగ్గించాయి. ప్రజల ఆశలకు అనుగుణంగా దేశవ్యాప్తంగా విస్తృతమైన రాజకీయ ప్రభావాన్ని చూపడంలో ఈ పార్టీలు విఫలమయ్యాయి.కాంగ్రెస్ బలహీనపడిన సమయంలో జనతా పార్టీ, నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్ వంటి కూటములు ప్రత్యామ్నాయాలుగా ముందుకొచ్చాయి. కాంగ్రెస్ అనుసరించిన విధానాల్లోని లోపాలను సరిదిద్ది, ప్రజలకు మెరుగైన పాలన అందిస్తామని హామీ ఇచ్చాయి. అయితే భిన్న సిద్ధాంతాలు, వేర్వేరు రాజకీయ ప్రయోజనాలు కలిగిన పార్టీలు ఒకే వేదికపై ఎక్కువకాలం కొనసాగలేకపోయాయి. అధికార పంపిణీ, నాయకత్వ పోటీలు, పరస్పర విభేదాలు కూటముల పతనానికి దారితీశాయి. దీంతో దేశానికి స్థిరమైన ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థను అందించడంలో అవి విఫలమయ్యాయి.ఈ రాజకీయ శూన్యంలో భారతీయ జనతా పార్టీ బలమైన ప్రత్యామ్నాయంగా ఎదిగింది. అభివృద్ధి, జాతీయవాదం, సాంస్కృతికవాదం అనే అంశాలను ముందుకు తీసుకొచ్చింది. దేశానికి కొత్త దిశను చూపగలమని ప్రజల్లో ఆశలు కల్పించింది. ముఖ్యంగా అవినీతి రహిత పాలన, ఆర్థిక ప్రగతి, ఉద్యోగ అవకాశాలు, మౌలిక సదుపాయాల విస్తరణ వంటి హామీలు ప్రజలను ఆకర్షించాయి. అయితే కాలక్రమంలో ఈ హామీల అమలుపై ప్రశ్నలు తలెత్తాయి. అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా చేరుతున్నాయా? నిరుద్యోగ సమస్య పరిష్కారమవుతోందా? రైతుల ఆదాయం పెరుగుతోందా? సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయా? అనే ప్రశ్నలు ప్రజల్లో చర్చనీయాంశాలయ్యాయి.జాతీయవాదం, సాంస్కృతికవాదం పేరుతో ముందుకు తీసుకెళ్తున్న రాజకీయ విధానాలపై కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దేశ ఐక్యత, సామాజిక సామరస్యం, మతసామరస్యం ప్రజాస్వామ్యానికి పునాదులు. కానీ మత, కుల, ప్రాంతీయ విభేదాలు పెరిగే పరిస్థితులు ఏర్పడితే దేశ సమగ్రతకు విఘాతం కలిగే ప్రమాదం ఉంది. అభివృద్ధి పేరుతో ప్రజల ప్రాథమిక సమస్యలను పక్కనపెట్టకూడదు. జాతీయవాదం అంటే దేశంలోని ప్రజలందరి సంక్షేమం, సమాన అవకాశాలు, రాజ్యాంగ విలువల పరిరక్షణ కూడా అని పాలకులు గుర్తించాలి.దేశంలోని రాజకీయ సంక్షోభానికి మరో ముఖ్యమైన కారణం ప్రజా సంక్షేమ విధానాల అమలులో చిత్తశుద్ధి లోపించడం. స్వాతంత్ర్యానంతరం భూ సంస్కరణలు, పంచాయతీరాజ్ వ్యవస్థ, సహకార సంస్థలు, సహకార బ్యాంకుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక, ఆర్థిక మార్పులు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం, భూమిలేని పేదలకు భూమి పంపిణీ చేయడం, గ్రామీణ ప్రజలకు ఆర్థిక స్వావలంబన కల్పించడం వంటి లక్ష్యాలు నిర్దేశించారు. కానీ అనేక ప్రాంతాల్లో ఈ వ్యవస్థలు రాజకీయ పలుకుబడి కలిగినవారి చేతుల్లోకి వెళ్లాయి. ప్రజలకు అందాల్సిన ప్రయోజనాలు కొందరికే పరిమితమయ్యాయి. ఫలితంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ఆశించిన మార్పులు రాలేదు.పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారా గ్రామస్థాయిలో ప్రజలకు పాలనలో భాగస్వామ్యం కల్పించాలని రాజ్యాంగం లక్ష్యంగా నిర్దేశించింది. స్థానిక సంస్థలకు అధికారాలు, నిధులు, విధులు బదిలీ చేయడం ద్వారా గ్రామాల అభివృద్ధిని వేగవంతం చేయవచ్చు. కానీ అనేక సందర్భాల్లో స్థానిక సంస్థలు నిధుల కొరత, అధికారాల పరిమితులు, రాజకీయ జోక్యం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నాయి. సహకార రంగం కూడా రైతులు, చిన్న వ్యాపారులు, గ్రామీణ ప్రజలకు ఆర్థిక బలాన్ని అందించాల్సి ఉండగా, కొన్నిచోట్ల రాజకీయ ప్రయోజనాలకు వేదికగా మారింది. ఈ వ్యవస్థలు సమర్థంగా పనిచేసి ఉంటే గ్రామీణ భారతదేశంలో గణనీయమైన మార్పులు వచ్చేవి.ప్రస్తుత రాజకీయ పరిస్థితులను పరిశీలిస్తే కేవలం కాంగ్రెస్ లేదా బీజేపీ వైఫల్యాల గురించి మాత్రమే చర్చించడం సరిపోదు. దేశాన్ని పాలించిన ప్రతి రాజకీయ పార్టీ తన బాధ్యతలను ఎంతవరకు నిర్వర్తించిందనే అంశాన్ని సమీక్షించుకోవాలి. ఎన్నికల్లో గెలవడం, అధికారాన్ని చేపట్టడం రాజకీయ పార్టీల అంతిమ లక్ష్యం కాకూడదు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడం, నిరుద్యోగాన్ని తగ్గించడం, పేదరికాన్ని నిర్మూలించడం, విద్యా, వైద్య రంగాలను బలోపేతం చేయడం, రైతుల సమస్యలను పరిష్కరించడం వంటి అంశాలే పాలనకు గీటురాయిగా ఉండాలి. కానీ ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలకు, అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టే చర్యలకు మధ్య అంతరం కనిపిస్తుండటంతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది.ప్రపంచవ్యాప్తంగా కూడా ఇలాంటి రాజకీయ అసంతృప్తి కనిపిస్తోంది. వివిధ దేశాల్లో ప్రభుత్వాలు, సంప్రదాయ రాజకీయ పార్టీలు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమవుతున్నాయనే భావన బలపడుతోంది. ముఖ్యంగా యువతరం ప్రస్తుత రాజకీయ వ్యవస్థపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తోంది. ఉపాధి అవకాశాలు లేకపోవడం, జీవన వ్యయం పెరగడం, ఆర్థిక అసమానతలు, అవినీతి, రాజకీయ నాయకుల స్వార్థపూరిత ధోరణులు యువతలో ఆగ్రహానికి కారణమవుతున్నాయి. గత తరాలు సాధించిన అభివృద్ధి తమకు ఆశించిన స్థాయిలో అవకాశాలను కల్పించడం లేదనే భావన కూడా యువతలో పెరుగుతోంది.ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ గిగ్ వర్కర్లకు

గిగ్ వర్కర్లకు చట్టబద్ధమైన గుర్తింపు
ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గిగ్ వర్కర్లు కష్టానికి తగిన ఆదాయం పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రాహుల్ గాంధీని కలిసిన గిగ్ వర్కర్లు తమకు చట్టపరమైన రక్షణ, గుర్తింపు లేదని సమస్యలు వివరించారని గుర్తుచేశారు. వారికి న్యాయం చేస్తామని అప్పట్లో రాహుల్ హామీ ఇచ్చారని, ఇప్పుడు ఆ మాట నిలబెట్టుకున్నారని పేర్కొన్నారు.
వివిధ రంగాలకు చెందిన పలువురి అభిప్రాయాలు, సలహాలు తీసుకున్న తర్వాతే ఈ చట్టాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటమే కాంగ్రెస్ పార్టీ విధానమని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.
బైక్ ర్యాలీలో పాల్గొన్న రాహుల్, రేవంత్
సభకు ముందు శిల్పకళా వేదిక నుంచి జయభేరీ గ్రౌండ్స్ వరకు గిగ్ వర్కర్లు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, పలువురు మంత్రులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.
అనంతరం జయభేరీ గ్రౌండ్స్‌లో రాహుల్ గాంధీ గిగ్ వర్కర్లతో ముఖాముఖి నిర్వహించారు. వారి సమస్యలు, డిమాండ్లను నేరుగా అడిగి తెలుసుకున్నారు.

రాహుల్ గాంధీ హామీలన్నీ..

ఇచ్చిన 6 గ్యారంటీలు ఇప్పటివరకు గాలి మూటలుగానే మిగిలిపోయిన మాట వాస్తవం కాదా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ ఇచ్చిన వరంగల్, కామారెడ్డి డిక్లరేషన్‌ల అమలు ఏమైందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత హామీలను నెరవేర్చకుండా పక్కనపెట్టేసి, ఇప్పుడు కొత్తగా మరో హామీ ఇవ్వడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని ఆరోపించారు.రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న ఆరోగ్యశ్రీ పథకానికి నిధులు సరిగ్గా కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని బండి సంజయ్ ఆరోపించారు. ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు జర్నలిస్టులకు ఇచ్చిన హెల్త్ కార్డులు కూడా ఆసుపత్రులలో సరిగ్గా పనిచేయడం లేదని ఆయన గుర్తుచేశారు. ఉన్న పథకాలకే దిక్కులేకుండా చేసి, కొత్తగా గిగ్ వర్కర్లకు బీమా, ఆరోగ్య భద్రత కల్పిస్తామంటే ఎవరూ నమ్మే పరిస్థితుల్లో లేరని సంజయ్ స్పష్టం చేశారు.

తెలంగాణ ప్రజలకు రాహుల్ గాంధీ

కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారెంటీలపై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. బీసీ డిక్లరేషన్‌లో భాగంగా రూ. 1 లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని చెప్పి, మూడేళ్లలో రూ. 5,000 కోట్లు కూడా కేటాయించలేదని కేటీఆర్ ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల హామీని కూడా గాలికి వదిలేశారని మండిపడ్డారు.అలాగే ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికి, కేవలం 10 వేల ఉద్యోగాలతో సరిపెట్టారని విమర్శించారు. విద్యార్థులకు రూ. 5 లక్షల విద్యా భరోసా కార్డులు, పేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ. 12 లక్షల చొప్పున ఇచ్చే అంబేడ్కర్ అభయ హస్తం సాయం, మైనా ర్టీల నిధుల కేటాయింపుల్లోనూ ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులు,రైతులసమస్యలపైరాహుల్ గాంధీ ఎందుకు స్పందించడం లేదని కేటీఆర్ నిలదీశారు.

2014 ఎన్నికల్లో

2014 ఎన్నికల ప్రచారంలో రూ.వందల కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. 2014 ఎన్నికల్లో భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ధ్వంసమైందని విమర్శించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. హైదరాబాద్?లో జరిగిన భారత్ సమ్మిట్-2026లో పాల్గొని ప్రసంగించారు. రాజకీయాల్లో ఫాసిస్టులకు చోటు లేదని, ఫాసిస్టుల వల్ల వ్యవస్థలు ధ్వంసం అవుతున్నాయని రాహుల్ గాంధీ విమర్శించారు. రాజకీయాలంటే గట్టిగా మాట్లాడటం, ఘాటైన విమర్శలు చేయడం కాదన్నారు.
ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చాక, సంపన్నుల జాబితాలో అదానీ రెండో స్థానంలోకి వచ్చారని రాహుల్ గాంధీ తెలిపారు. 12 ఏళ్ల క్రితం 600వ స్థానంలో ఉండే వ్యక్తి ఇప్పుడు ఎక్కడున్నారన్నారు. ఏ రంగంలో చూసినా అదానీ పెట్టుబడులే కనిపిస్తాయన్నారు. మోదీ ప్రధానిగా వచ్చాక అదానీ వ్యాపారం బాగా పెరిగిందని తెలిపారు. పోర్టులు, విమానాశ్రయాలు, మౌలిక వసతులు అదానీకి అప్పగించారని ఆరోపించారు. లబ్ధి పొందిన వ్యాపారులు వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.“మహారాష్ట్రలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో యూపీఏ కూటమి ఎక్కువ సీట్లు గెలిచింది. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన 3 నెలలకే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం. మహారాష్ట్ర ఎన్నికల్లోనూ అనేక అవకతవకలకు పాల్పడ్డారు. ఆ రాష్ట్రంలో 3 నెలల వ్యవధిలో 70 లక్షల మందిని ఓటర్లుగా నమోదు చేశారు. అదనంగా చేర్చిన ఓట్ల ద్వారానే బీజేపీ గెలిచింది. వ్యవస్థలు నాశనం అవుతున్నా మనం ప్రజాస్వామ్యం అని చెప్పుకుంటున్నాం. హైదరాబాద్, బెంగళూరులో ఐటీ రంగం బాగా అభివృద్ధి చెందింది” – రాహుల్ గాంధీ, లోక్?సభ ప్రతిపక్ష నేత
కేంద్రంలో ఉండే పెద్దలు ప్రజల సమస్యలు వినడం లేదని రాహుల్ ఆరోపించారు. తాము చేపట్టిన పాదయాత్రలో అనేక ఫిర్యాదులు వచ్చాయని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం దిశగా కాంగ్రెస్ పోరాటం చేసిందన్నారు. కొందరిని కొంతకాలమే మోసం చేయగలరని, అందరినీ ఎల్లకాలం మోసం చేయలేరని కెన్నడీ చెప్పారన్నారు. అబద్ధాలతో ప్రజలను ఎందుకు మోసం చేస్తున్నారని నిలదీశారు.సత్యం, అహింస అనేవి బలమైన ఆయుధాలని, హింస, విద్వేషం, ఘర్షణ వాతావరణంలో అభివృద్ధి చెందలేమని స్పష్టం చేశారు. విద్వేషం, అహింసతో వాళ్లను ఓడించలేమని, తమ మనస్తత్వం అలాంటిది కాదని పేర్కొన్నారు.

రాహుల్ గాంధీ నాయకత్వం కోసం దేశం

కోసం దేశం ఎదురు చూస్తోంది. ఆయన నాయకత్వ లక్షణాల గురించి ప్రపంచం గొప్పగా మాట్లాడుకుంటోంది. ఆయన నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధిని ప్రపంచం గమనిస్తోంది' అని మంత్రి పేర్కొన్నారు.భారత్ సమ్మిట్‌లో రెండు రోజుల పాటు అర్థవంతమైన చర్చలు జరిగాయని మంత్రి ఉత్తమ్ కుమార్ తెలిపారు. సమ్మిట్‌లో జస్టిస్, డెమోక్రసీ అంశాలపై ప్రతినిధులు తమ అభిప్రాయాలను తెలిపారన్నారు. దానితో పాటు సంక్షేమం, సోషల్ జస్టిస్, జెండర్ జస్టిస్‌పై దీర్ఘంగా చర్చించినట్లు మంత్రి తెలిపారు.

ఇకపై ఆ ప్రాసీజర్

తెలిపారు. ఈ భేటీలో చెరువుల సంరక్షణతో పాటు ప్రాచీన మెట్ల బావుల పునరుద్ధరణను కూడా ప్రధాన ఎజెండాగా చేర్చనున్నట్లు చెప్పారు.చెరువులతో పోలిస్తే మెట్ల బావులు వికేంద్రీకృత జల వనరులుగా సమాజానికి ఎంతో మేలు చేస్తాయని ఆయన వివరించారు. గతంలో ఆలయాలు, చెరువుల పరిసరాల్లో ఉన్న అనేక మెట్ల బావులు కాలక్రమేణా కనుమరుగయ్యాయని, వాటిని తిరిగి వెలుగులోకి తెచ్చి పునరుద్ధరిస్తే భూగర్భ జల మట్టాలు గణనీయంగా పెరుగుతాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో నెలకొన్న నీటి కొరత నేపథ్యంలో ఈ చర్యలు ఎంతో ఆవశ్యకమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పటికే హైదరాబాద్ పరిధిలో దాదాపు అంతరించిపోయిన పలు చెరువులను హైడ్రా విజయవంతంగా పునరుద్ధరించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.
అధికారిక లెక్కల ప్రకారం తెలంగాణవ్యాప్తంగా 600కు పైగా, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 160కి పైగా మెట్ల బావులు ఉన్నట్లు గుర్తించారు. క్షేత్రస్థాయిలో వీటి సంఖ్య మరింత ఎక్కువగా ఉండే అవకాశముంది. కాగా, ఈ సదస్సు సందర్భంగా ఆకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ సంప్రదాయ మెట్ల బావుల వారసత్వం, పూర్వకాలపు నీటి సంరక్షణ పద్ధతులపై ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ.. ప్రస్తుత నీటి సంక్షోభం కారణంగా పురాతన నీటి పరిరక్షణ పద్ధతులపై ప్రాధాన్యత పెరిగిందన్నారు. సంప్రదాయ జల వనరుల సంరక్షణకు సంబంధించిన కీలక అంశాలను క్యూర్ (జఖ=జు) చట్టంలో చేర్చినట్లు ఆయన వెల్లడించారు. ప్రాచీన జల వనరులకు జీవం పోయడం ద్వారా నగరంలో నీటి భద్రతను పటిష్ఠం చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు.

హైదరాబాద్‌లో నిషేధిత

అబ్దుల్లా అర్షద్‌తో పాటు మరో ఐదుగురు వర్కర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. దుబాయ్‌లో ఉంటున్న తన స్నేహితుడు షరీఫ్ సహకారంతో బల్క్ పరిమాణంలో ఇ-సిగరెట్లను నగరానికి తెప్పించి, ఇక్కడి వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. గుడిమల్కాపూర్‌తో పాటు మాదాపూర్ ప్రాంతాల్లోనూ ఈ అక్రమ వ్యాపారాన్ని విస్తరించినట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది.దాడుల సందర్భంగా నిందితుల వద్ద నుంచి సుమారు రూ.7,06,800 విలువైన వివిధ రకాల నిషేధిత ఇ-సిగరెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు 1,000 రాజదీ పేపర్లు, ఏడు మొబైల్ ఫోన్లు, అక్రమ సరఫరాకు ఉపయోగిస్తున్న సుజుకి యాక్సెస్ 125 స్కూటర్ (ఏ+-08-ూా+-9032), రెండు పేటీఎం స్వైపింగ్ మెషిన్లను సీజ్ చేశారు. విదేశాల నుంచి ఇ-సిగరెట్లను బల్క్‌గా తెప్పించి నగరంలో విక్రయిస్తున్న ఈ ముఠా కార్యకలాపాలపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్‌లో దీచీూ 223, రాజుజ యాక్ట్-2019 కింద కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితుడికి సహకరిస్తూ దుబాయ్ నుంచి ఇ-సిగరెట్లను సరఫరా చేస్తున్న షరీఫ్ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

కేంద్రం, ఎన్నికల సంఘం,

పేర్కొందని రాహుల్ గాంధీ చెప్పుకొచ్చారు. అంత పెద్ద మొత్తంలో ఓట్లు తొలగించి ఎన్నికలు జరిపితే, వాటిని అసలు ఎన్నికలు అని ఎలా అంటారని ఆయన ప్రశ్నించారు.ప్రధాని నరేంద్ర మోదీ, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ మాత్రమే దేశాన్ని ఆక్రమిస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. దేశంలోని కీలకమైన పోర్టులు, ఎయిర్‌పోర్టులు, గనులు (మైన్స్) అన్నీ అదానీ చేతుల్లోకి వెళ్లిపోతున్నాయని విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన అన్ని వ్యవస్థలు వారి చేతుల్లోనే బంధీ అయ్యాయని, ప్రతిపక్షంగా తాము ఏదైనా చేద్దామన్నా వ్యవస్థల నుంచి ఎలాంటి మద్దతు లభించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.వ్యవస్థలు సహకరించకపోయినా తాము నిరాశ చెందకుండా నేరుగా ప్రజల్లోకి వెళ్లగలిగామని రాహుల్ తెలిపారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు సాగిన 'భారత్ జోడో' పాదయాత్ర ద్వారా కోట్లాది మంది ప్రజలను నేరుగా కలుసుకున్నామని, ఆ ప్రయాణంలో మమ్మల్ని మేము మరింతగా తెలుసుకోగలిగామని చెప్పారు. రాజకీయాల్లో హింస, ద్వేషం, కోపం ఎన్నటికీ పనిచేయవని.. కేవలం ప్రేమ, అభిమానం, అహింస, సత్యం మాత్రమే ఎప్పటికీ గెలుస్తాయని ఆయన స్పష్టం చేశారు. తమ సిద్ధాంతాలకు కట్టుబడి, సత్యం, అహింసా మార్గంలోనే తమ పోరాటం కొనసాగుతుందని రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు.

విదేశాల్లో భారత ప్రతిష్టను రాహుల్ గాంధీ

పరిస్థితుల్లో దేశాన్ని రక్షించే సైనికులను కూడా అవమానించేలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్యమే లేకపోతే రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పాదయాత్ర ఎలా చేయగలిగారని ఆయన నిలదీశారు.
ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టిందని ఆరోపించారు. “హైదరాబాద్‌కు వచ్చే ముందు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల గురించి రాహుల్ మాట్లాడారా. ఎన్నికల మేనిఫెస్టోను సీఎం రేవంత్ రెడ్డి తుంగలో తొక్కారు. విద్యార్థులకు ఫీజ్ రీయింబర్స్‌మెంట్, రైతులకు రుణమాఫీ లేదు” అని వ్యాఖ్యానించారు. ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీలను వెంటనే నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో రైతులకు ముప్పు!

విదేశీ ఉత్పత్తుల పోటీతో దేశీయ వ్యవసాయానికి నష్టం.. రైతుల ప్రయోజనాలే ప్రథమ ప్రాధాన్యం కావాలి



ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు విస్తరిస్తున్నాయి. ఇందులో భాగంగా భారత్ అనేక దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటోంది. దిగుమతి సుంకాలను తగ్గించడం, ఎగుమతులను ప్రోత్సహించడం, పెట్టుబడులకు అవకాశాలు కల్పించడం ఈ ఒప్పందాల ప్రధాన లక్ష్యం. అయితే వీటి వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనాలు కలిగే అవకాశం ఉన్నప్పటికీ, వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.భారతదేశంలో ఎక్కువ మంది రైతులు చిన్న, సన్నకారు రైతులే. పరిమిత భూమి, అధిక సాగు ఖర్చులు, విత్తనాలు, ఎరువుల ధరల పెరుగుదలతో వారు ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో రైతులకు భారీ సబ్సిడీలు, ఆధునిక యంత్రాలు, సాంకేతిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ఇలాంటి దేశాల వ్యవసాయ ఉత్పత్తులతో మన రైతులు పోటీపడటం కష్టతరంగా మారుతుంది.వాణిజ్య ఒప్పందాల కారణంగా విదేశీ వ్యవసాయ ఉత్పత్తులు తక్కువ ధరలకు భారత మార్కెట్‌లోకి వస్తే దేశీయ పంటలకు గిట్టుబాటు ధర లభించకపోవచ్చు. మొక్కజొన్న, సోయాబీన్, పాల ఉత్పత్తులు, పప్పుధాన్యాలు, వంటనూనెలు, పండ్ల దిగుమతులు పెరిగితే ఆయా పంటలు పండించే రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే వ్యవసాయ మార్కెట్లలో ధరల ఒడిదుడుకులతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఇది మరింత భారంగా మారుతుంది.దేశంలో పప్పుధాన్యాలు, నూనెగింజల ఉత్పత్తి పెంచాల్సిన అవసరం ఉన్నప్పటికీ దిగుమతులపై ఆధారపడుతున్న

నమస్తే హైదరాబాద్
మీ గళం.. మా కలం...!
NAMASTHE HYDERABAD
తెలుగు దిన పత్రిక
RNI No: APTEL/2012/45237

నవంబర్ 16న పిల్లల ప్రజావాణి

★ బాలల హక్కులపై అవగాహనకు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ చొరవ



మేడ్చల్ జిల్లా (నమస్తే హైదరాబాద్): బాలల హక్కులపై సమాజంలో అవగాహన పెంపొందించి, వారి సమస్యల పట్ల ప్రతి ఒక్కరిలో బాధ్యతను పెంచేందుకు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. నవంబర్ 14 నుంచి 20 వరకు నిర్వహించే బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా, 2026 నవంబర్ 16న "పిల్లల ప్రజావాణి" కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.
మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, యూనిసెఫ్ భాగస్వామ్యంతో కార్యక్రమం నిర్వహించబడుతుంది. సాధారణ ప్రజావాణి జరిగే ప్రాంగణంలో పిల్లల కోసం ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేయనున్నారు.ఈ వేదిక ద్వారా పిల్లలు తమ విద్య, ఆరోగ్యం, పోషణ, రక్షణ, మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల లబ్ధి తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను నేరుగా తెలియజేసి వినతిపత్రాలు సమర్పించవచ్చు. బాల కార్మికత్వం, బాల్య వివాహాలు, వేధింపులు, దోపిడీ వంటి సమస్యలను కూడా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావచ్చు. అందిన వినతులపై సంబంధిత శాఖల సమన్వయంతో తగిన తదుపరి చర్యలు చేపట్టేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది.
జిల్లాలో పిల్లల సంక్షేమం, సంరక్షణ, సమగ్ర అభివృద్ధి కోసం మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ వివిధ కార్యక్రమాలు, పథకాలను అమలు చేస్తోంది. ఈ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, పిల్లల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వడం, వారి హక్కుల పరిరక్షణలో సమాజ భాగస్వామ్యాన్ని పెంపొందించడం "పిల్లల ప్రజావాణి" ప్రధాన లక్ష్యం.పిల్లలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ కోరుతోంది.

భారత్ సమిట్ 2026లో పాల్గొన్న ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ పరమేశ్వర్ రెడ్డి



★ మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో మర్యాదపూర్వక భేటీ.. 70 దేశాల ప్రతినిధుల హాజరు

ఉప్పల్, నవంబర్ 14 (నమస్తే హైదరాబాద్): హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీ వేదికగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన భారత్ సమిట్--2026లో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్‌తో కలిసి ఈ అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్నారు.సుమారు 70 దేశాలకు చెందిన ప్రతినిధులు, రాజకీయ నాయకులు, విధాన రూపకర్తలు, మేధావులు, వివిధ రంగాల ప్రముఖులు హాజరైన ఈ సదస్సులో ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, ప్రపంచ రాజకీయ పరిణామాలు, కృత్రిమ మేధస్సు, వాతావరణ మార్పులు, సుస్థిర అభివృద్ధి తదితర కీలక అంశాలపై విస్తృతంగా చర్చలు జరిగాయి.ఈ సందర్భంగా సదస్సులో చర్చించిన అంశాలను పరమేశ్వర్ రెడ్డి ఆసక్తిగా తెలుసుకున్నారు. పలు ప్రముఖులతో సమావేశమై వివిధ అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రపంచ దేశాల మధ్య పరస్పర సహకారం, సమానత్వం, అభివృద్ధి సాధనకు ఇటువంటి అంతర్జాతీయ వేదికలు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు.భారత్ సమిట్--2026లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రముఖులు పాల్గొన్న ఈ సదస్సు ద్వారా అనేక విషయాలను తెలుసుకునే అవకాశం లభించిందని తెలిపారు.

దేశ నిర్మాణంలో నెహ్రూ సేవలు చిరస్మరణీయం.. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

★ మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎంఏ జలీల్ పాషా



రామంతాపూర్, నవంబర్ 14 (నమస్తే హైదరాబాద్): భారతదేశ తొలి ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా రామంతాపూర్ శ్రీనగర్ కాలనీలో ఘనంగా పుష్పాంజలి కార్యక్రమం నిర్వహించారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎంఏ జలీల్ పాషా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జలీల్ పాషా మాట్లాడుతూ.. భారతదేశ అభ్యున్నతికి, ఆధునిక దేశ నిర్మాణానికి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దేశ అభివృద్ధికి పునాదులు వేసిన దార్శనిక నాయకుడిగా ఆయన చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. నెహ్రూ దూరదృష్టితో కూడిన నాయకత్వం, దేశ నిర్మాణంలో ఆయన పోషించిన కీలక పాత్రను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. చిన్నారులంటే నెహ్రూకు అమితమైన ప్రేమ, ఆప్యాయత ఉండేదని, అందుకే ఆయన జయంతిని దేశవ్యాప్తంగా బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని గుర్తుచేశారు. పిల్లలే దేశ భవిష్యత్తు అని విశ్వసించిన నెహ్రూ ఆశయాలు, ఆదర్శాలను నేటి యువత, విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, చెంచులు, అశోక్ రెడ్డి, వెంకటేష్, మోసిన్, సోలమన్, సతీష్, అనితతో పాటు పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు ఘన నివాళులర్పించారు.

రాహుల్ గాంధీ గిగ్ వర్కర్ల పాదయాత్రకు సంఘీభావం



★ విశాల్ మార్ట్ నుంచి ప్రారంభమైన పాదయాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

వెంకట్ రెడ్డి నగర్, నవంబర్ 14 (నమస్తే హైదరాబాద్): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గిగ్ వర్కర్స్‌కు మద్దతుగా చేపట్టిన పాదయాత్రకు సంఘీభావంగా విశాల్ మార్ట్ నుంచి ప్రారంభమైన పాదయాత్రలో వెంకట్ రెడ్డి నగర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, ప్రజాస్వామ్య పరిరక్షణతో పాటు కార్మికులు, గిగ్ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాదయాత్రలో పాల్గొన్నారు. రాహుల్ గాంధీ చేపడుతున్న పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నామ్ రాజ్ రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్ పటేల్, కిషోర్, బాలయ్య, అరుణ్, సాయి భాను, నరేష్, పాలబలయ, నరసింహ చారి, చోటు, రాజేష్, నాగేష్, శివ, సాయి, నవీన్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ పర్యటన నేపథ్యంలో బీజేపీ నేత పోతగాని గోపాల్ గౌడ్ హౌస్ అరెస్ట్

★ ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుంటోంది.. ముందస్తు అరెస్టులు ప్రజాస్వామ్య విరుద్ధం: బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి





నాచారం, నవంబర్ 14 (నమస్తే హైదరాబాద్): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటన నేపథ్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలను రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా అరెస్టులు చేయడం, గృహ నిర్బంధాలకు గురిచేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. రాహుల్ గాంధీ పర్యటన సందర్భంగా నిరసనలు వ్యక్తం చేస్తారనే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల ద్వారా బీజేపీ శ్రేణులపై నిర్బంధ చర్యలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు.
ఈ సందర్భంగా గోపాల్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ నిరసన తెలిపే హక్కు ఉంటుందని, అయితే అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష నాయకులను ముందస్తుగా అరెస్టు చేయించడం కాంగ్రెస్ ప్రభుత్వ పిరికిపంద చర్య అని విమర్శించారు. ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, ఇతర హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ఆ వైఫల్యాలను ప్రశ్నిస్తారనే భయంతోనే బీజేపీ నాయకులను నిర్బంధిస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటన నేపథ్యంలో ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు నేనావత్ రవి నాయక్, బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్, బీజేవైఎం నల్లగొండ ఇన్‌చార్జి ఎల్లగొని అభిషేక్ గౌడ్‌లను పోలీసులు అరెస్టు చేసి నాచారం పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.అక్రమంగా అరెస్టు చేసిన బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి నిర్బంధ చర్యలతో బీజేపీ కార్యకర్తల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరని, ప్రజా సమస్యలపై తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని గోపాల్ గౌడ్ స్పష్టం చేశారు.

శ్రీ రాఘవేంద్ర నగర్ కాలనీలో త్వరలో సిమెంట్ రోడ్ల నిర్మాణం

★ మంచినీటి పైపులైన్ల ఏర్పాటు పూర్తి.. రోడ్ల నిర్మాణ పనుల పరిశీలనలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్



నాచారం, నవంబర్ 14 (నమస్తే హైదరాబాద్): ఉప్పల్ నియోజకవర్గంలోని నాచారం డివిజన్ శ్రీ రాఘవేంద్ర నగర్ కాలనీలో త్వరలో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. కాలనీలో ఇప్పటికే డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తికాగా, సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ముందు మంచినీటి పైపులైన్ల సమస్యను గుర్తించారు. దీంతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవతో కాలనీ మొత్తం నూతన మంచినీటి పైపులైన్ల ఏర్పాటు పనులను పూర్తి చేశారు.మంచినీటి పైపులైన్ల ఏర్పాటు పూర్తయిన నేపథ్యంలో త్వరలో చేపట్టనున్న సిమెంట్ రోడ్ల నిర్మాణ పనుల పరిశీలన కోసం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ శనివారం కాలనీవాసులు, సంబంధిత అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు.ఈ సందర్భంగా కాలనీలో నిర్మించనున్న సిమెంట్ రోడ్ల పనులను త్వరితగతిన ప్రారంభించాలని అధికారులకు సూచించారు. కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రహదారులను విశాలంగా నిర్మించాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ మౌలిక సదుపాయాలను మెరుగుపర్చాలని కోరారు.కాలనీలో డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ల సమస్యలను పరిష్కరించి సిమెంట్ రోడ్ల నిర్మాణానికి మార్గం సుగమం చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ఈ సందర్భంగా కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఏఈ సూరజ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, కాలనీ అధ్యక్షులు మక్తాల శేఖర్ గౌడ్, రామ్ రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వీరబోయిన రజిత నియామకం



★ గాంధీభవన్‌లో నియామక పత్రం అందజేసి అభినందించిన అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా

ఉప్పల్, నవంబర్ 14 (నమస్తే హైదరాబాద్): తెలంగాణ మహిళా కాంగ్రెస్‌లో నూతనంగా వివిధ పదవులు పొందిన నాయకురాళ్లకు గాంధీభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నియామక పత్రాలను అందజేశారు. అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా నియమితులైన నాయకురాళ్లకు నియామక పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా వీరబోయిన రజితకు మహిళా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వుల ప్రతిని అల్కా లాంబా అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా రజితను ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు స్వర్ణ, కమలాక్షి తదితర మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకురాళ్లకు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించాలని నాయకత్వం దిశానిర్దేశం చేసింది.

మైనారిటీ సమాజ అభివృద్ధికి కృషి చేసిన మేడల మల్లికార్జున్ గౌడ్‌కు ఘన సన్మానం

★ ఈద్గాహ్ అభివృద్ధి పనులకు రూ.19.80 లక్షల నిధుల మంజూరులో కీలక పాత్ర



నాచారం, నవంబర్ 14 (నమస్తే హైదరాబాద్): ఈద్గాహ్ అభివృద్ధి పనుల కోసం రూ.19 లక్షల 80 వేల నిధులు మంజూరు చేయించడంలో విశేష కృషి చేసిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మేడల మల్లికార్జున్ గౌడ్‌ను ముస్లిం మైనారిటీ సమాజ పెద్దలు ఘనంగా సన్మానించారు.ఈద్గాహ్ అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరులో కీలక పాత్ర పోషించి, మైనారిటీ సమాజ అవసరాలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన మేడల మల్లికార్జున్ గౌడ్ సేవలను ఈ సందర్భంగా వారు కొనియాడారు. సమాజ అభివృద్ధి పట్ల ఆయన చూపిన చొరవ, సేవాభావాన్ని అభినందిస్తూ శాలువాతో సత్కరించారు.
అదేవిధంగా, ఈద్గాహ్ అభివృద్ధి పనుల కోసం రూ.19.80 లక్షల నిధులు మంజూరు చేయించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ముస్లిం మైనారిటీ సంఘం ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అన్ని వర్గాల అభివృద్ధికి ఎమ్మెల్యే చూపిస్తున్న చొరవను, ప్రజా సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషిని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు టేకులపల్లి రామచంద్ర, మొహమ్మద్ యూసఫ్, ఇమ్రోజ్, హరిప్రసాద్, రాకేష్, కుమార్, గొల్లూరి ప్రభాకర్, హరిబాబు, సోహైల్, తన్వీర్, సాయి తదితరులు పాల్గొన్నారు.
ఈద్గాహ్ కమిటీ అధ్యక్షులు సయ్యద్ సయీద్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఫారూఖ్‌తో పాటు కమిటీ సభ్యులు సయ్యద్ రహీమ్, సయ్యద్ ఆజమ్, మొహమ్మద్ యూసఫ్, సయ్యద్ తాహెర్, మొహమ్మద్ నదీమ్, సయ్యద్ అంజద్, సయ్యద్ లతీఫ్, సయ్యద్ జకీర్, షానూర్ తదితరులు పాల్గొన్నారు.సమాజ అభివృద్ధి, సమైక్యత, ప్రజాసేవే తమ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా మైనారిటీ సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.

నమస్తే హైదరాబాద్
మీ గళం.. మా కలం...!
NAMASTHE HYDERABAD
తెలుగు దిన పత్రిక
RNI No: APTEL/2012/45237

సీఎస్ఈలో గీతం స్కాలర్ కు పీహెచ్.డీ.

పఠాన్ చెరు /నమస్తే హైదరాబాద్ నవంబర్ 14:-హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి హెచ్.వి. రమణారావు డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'డీప్ లెర్నింగ్ మోడళ్ల మూల్యాంకనంతో పాటు, ఏకీకృతం చేయడం ద్వారా ప్రోస్టేట్ క్యాన్సర్ గ్రేడింగ్ ను మెరుగుపరచడం'పై ఆయన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వి. రవిశంకర్ శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.



డా హెచ్ వి రమణ రావు

తన మార్గదర్శనంలో, హిస్టోపాథలాజికల్ చిత్రాలను ఉపయోగించి ప్రోస్టేట్ క్యాన్సర్ ను స్వయంచాలకంగా గుర్తించడం, గ్రేడింగ్ చేయడాన్ని మెరుగుపరచడానికి డాక్టర్ రమణారావు అధునాతన డీప్ లెర్నింగ్ మోడళ్లను అభివృద్ధి చేసినట్టు తెలియజేశారు. ఆయన పరిశోధనలో కన్వల్యూషనల్ న్యూరల్ నెట్ వర్కులు, విజన్ ట్రాన్స్ ఫార్మర్లను ఏకీకృతం చేసి, 98.8 శాతం వర్గీకరణ కచ్చితత్వాన్ని సాధించారని, ఇది కచ్చితమైన, అర్థవంతమైన, సమర్థవంతమైన క్యాన్సర్ నిర్ధారణకు మద్దతు ఇచ్చే గణనీయమైన సామర్థ్యాన్ని కలిగి ఉందని వివరించారు.డాక్టర్ రమణారావు సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి సయ్యద్ అక్బరుద్దీన్, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర ఎస్.మహబూబ్ బాషా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించి, ఆయన తన విద్య, పరిశోధన వృత్తిలో నిరంతర విజయం సాధించాలని వారు ఆకాంక్షించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కార్తికేయ నగర్‌లో రూ.44 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణం

★ నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి.. అధికారులకు బీఆర్ఎస్ నాయకుడు మేడల మల్లికార్జున గౌడ్ సూచన

నాచారం, నవంబర్ 14 (నమస్తే హైదరాబాద్):నాచారం 21వ డివిజన్ పరిధిలోని కార్తికేయ నగర్‌లో రూ.44 లక్షల వ్యయంతో చేపట్టిన సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మేడల మల్లికార్జున గౌడ్, కాలనీ అధ్యక్షుడు భువనగిరి చంద్రశేఖర్‌తో కలిసి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాలనీవాసులతో కలిసి పనుల పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా మేడల మల్లికార్జున గౌడ్ మాట్లాడుతూ సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కాలనీవాసులకు మెరుగైన రహదారి సదుపాయాలు కల్పించడంతో పాటు, రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు



తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపడమే అభివృద్ధి పనుల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.కార్తికేయ నగర్‌లో అభివృద్ధి పనులు చేపట్టడంపై కాలనీ అధ్యక్షుడు భువనగిరి చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. కాలనీ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న మేడల మల్లికార్జున గౌడ్‌కు కాలనీవాసుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రాము, కాలనీ అధ్యక్షుడు భువనగిరి చంద్రశేఖర్, కోశాధికారి శ్రీనివాసరెడ్డి, వరంగల్ రమేష్ పటేల్, కె. రమేష్ గౌడ్, శ్రవణ్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు దాసరి కర్ణ, సుగుణాకర్, ఊట్కూరి రాజేష్ గౌడ్, హరి ప్రసాద్, ఊట్కూరి సందీప్ గౌడ్, భాను లడ్డు, వాసు, గొల్లూరి ప్రభాకర్, గణేష్, మహమ్మద్ యూసుఫ్, ఊట్కూరి సురేష్ గౌడ్, ఇమ్రోస్, మ్యాగ్నెట్ మల్లేష్, అనిల్ సర్వర్, జబ్బర్, బండ్ల శేఖర్ రెడ్డి, రాకేష్, తండ ఈశ్వర్ గౌడ్, భాను, పేరు నాయక్ అశోక్, ఊట్కూరి సంతోష్ గౌడ్, గాజ్వేల్ శ్రీనివాస్, సైదులుతో పాటు కాలనీ పెద్దలు, పలువురు బీఆర్ఎస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

5 లక్షల రూపాయల విలువైన ఎల్ఓసి లను అందించిన ఎమ్మెల్యే జిఎంఆర్



పఠాన్ చెరు /నమస్తే హైదరాబాద్ నవంబర్14:-నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించి వారికి ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలవడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్ గ్రామానికి చెందిన కమ్మరి సుజాత, రామచంద్రాపురానికి చెందిన బండి సుజాతలు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడు తు న్నారు. మెరుగైన వైద్యం కోసం కోసం స్థానిక శాసనసభ్యులు జిఎంఆర్ ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు వారికి మంజూరైన 5 లక్షల రూపాయల విలువైన ఎల్ఓసి అనుమతి పత్రాలను శనివా రం ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు శ్రీశైలం యాదవ్, యాదగిరి యాదవ్, మాజీ జడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, నరసింహా, తదితరులు పాల్గొన్నారు.

రెండు కోట్ల 25 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

★ ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత..

★ పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..





పఠాన్ చెరు /నమస్తే హైదరాబాద్ నవంబర్ 14:-నియోజకవర్గ కేంద్రమైన పటాన్చెరు పరిధిలోని జెపి కాలనీ, పటాన్చెరు డివిజన్లలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు రూపకల్పన చేస్తూ.. ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి అంశాలకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. శనివారం పటాన్చెరు మరియు జేపీ కాలనీ డివిజన్ల పరిధిలోని వివిధ కాలనీలలో రెండు కోట్ల 25 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, యూజీడిలు, వర్షపునీటి కాలువలు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, కాలనీల్లో నెలకొన్న సమస్యలను స్వయంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల అవసరాలు, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని చెప్పారు. నూతన రహదారుల నిర్మాణంతో రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోతాయని, భూగర్భ డ్రైనేజీ, వర్షపు నీటి కాలువల నిర్మాణంతో మురుగునీరు, వర్షపు నీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.పటాన్చెరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తామని, ప్రజల సహకారంతో ప్రతి కాలనీకి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, నర్రా బిక్షపతి, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీధర్ చారి, ప్రకాష్ రావు, పృథ్వీరాజ్, వెంకటేష్, ఆశమ్, రామ్మోహన్, వివిధ శాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

బాలలు రోల్ మోడల్ గా నిలవాలి

★హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

★మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అసుంత నిలయంలో ఘనంగా బాలల దినోత్సవం

★బాలికలతో కలిసి నృత్యం చేసిన కలెక్టర్





హనుమకొండ, నవంబర్ 14 (నమస్తే హైదరాబాద్) :బాలలు రోల్ మోడల్ గా నిలవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. శనివారం హనుమకొండ సుబేదారిలోని అసుంత నిలయం చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్ ప్రాంగణంలో జిల్లా మహిళలు, దివ్యాంగులు వయో వృద్ధుల శాఖ జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి ఎం. విశ్వజ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ హాజరై మాట్లాడుతూ బాలల దినోత్సవ వేడుకల్లో బాలలకు సంబంధించి సున్నితమైన అంశాలను చక్కటి సందేశం తో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సామాజిక అంశాలపై అవగాహన కల్పించే విధంగా బాగున్నాయని ప్రశంసించారు. చిన్నారులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత నివ్వాలని పేర్కొన్నారు. చిన్నారులు తమకు తామే ఆదర్శంగా నిలవడమే కాకుండా ఇతరులకు కూడా స్ఫూర్తినిచ్చేలా ఎదగాలని ఆకాంక్షించారు. చైల్డ్ కేర్ సంస్థల్లో ప్రతివారం అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారని, వారిని అధికారులుగా కాకుండా స్నేహితులుగా భావించి తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని సూచించారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. చిన్నారుల సమస్యలను పరిష్కరించేందుకు ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బాల్య వివాహాల నిరోధం, బాల కార్మికుల వ్యవస్థ నుంచి పిల్లలకు రక్షణ, సంరక్షణ అవసరమైన చిన్నారులకు సహాయం అందించడం వంటి అంశాలపై ప్రత్యేకంగా పనిచేసేందుకు చైల్డ్ ప్రొటెక్షన్ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్ అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. చిన్నారుల భావి జీవితం ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. చిన్నారులతో కలిసి సెల్ఫీ పాయింట్ వద్ద జిల్లా కలెక్టర్ ఫోటో దిగారు. నిలయంలోని వసతులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ.. బాలలకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చలి తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా బాలికలు ఆరోగ్యం పట్ల జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. బాలికలు పౌష్టిక ఆహారం తీసుకోవాలన్నారు. బాలబాలికలు భవిష్యత్ లో ఉన్నత స్థానంలో నిలబడాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్పర్సన్ అనిల్ చందర్ రావు మాట్లాడుతూ.. బాలల న్యాయ చట్టం 2015 ప్రకారం బెంచ్ నిర్వహిస్తూ, 1980 దశకం నుంచి బాలల రక్షణ సంరక్షణ కోసం కృషి చేస్తున్న సీనియర్ చైల్డ్ రైట్స్ ఆక్టివిస్ట్ ఫాదర్ కోషి సహకారం, లైన్ డిపార్ట్మెంట్ సహకారంతో బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నామని అన్నారు.

■ బాలికలతో కలిసి నృత్యం చేసిన కలెక్టర్

బాలల దినోత్సవ వేడుకలను ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించగా చిన్నారుల సంతోషాన్ని కలెక్టర్ మరింత రెట్టింపు చేశారు. బాలికలు తమతో కలిసి నృత్యం చేయాలని కోరగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి వారితో కలిసి నృత్యం చేసి బాలల ఉత్సాహాన్ని రెట్టింపు చేశారు. తమతో కలిసి కలెక్టర్ నృత్యం చేయడంతో బాలికలు ఆనందంతో కేరింతలు పెట్టారు. కార్యక్రమం ప్రారంభంలో బాలికలు పలు గీతాలకు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి

ప్రచార రథం ప్రారంభం

బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా ఎఫ్ ఎం ఎం ఎస్ ఎస్ ఎస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని కలెక్టర్ చాహత్ బాజ్ పాయి జెండా ఊపి ప్రారంభించారు

బహుమతులు అందజేత

వివిధ క్రీడాంశాలలో నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబర్చిన బాలలకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం విశ్వజ, ఛైర్పర్సన్ అనిల్ చందర్ రావు, సిడబ్ల్యుసీ మాజీ ఛైర్పర్సన్లు మండల పరశురాములు, అనితా రెడ్డి, బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ సిహెచ్. అవంతి, ఎఫ్ ఎం ఎంఎస్ఎస్ఎస్ డైరెక్టర్ సిస్టర్ సహాయ, ఇంచార్జి డిసిపిఓ ఎస్. ప్రవీణ్ కుమార్, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ ఎస్. భాస్కర్, ఫాదర్ కోషి, ఎర్ర శ్రీకాంత్, బత్తుల కరుణ, కరుణాలయం, డివైన్ మెర్సీ, అసుంత నిలయం బాల లు, తదితరులు పాల్గొన్నారు.

కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమి...

★ రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా..

★ విలువైన ప్రభుత్వ భూములు అక్రమార్కుల కబంధహస్తాల్లోకి...



పటాన్చెరు /నమస్తే హైదరాబాద్ నవంబర్ 14:-బొల్లారం 272డివిజన్ :- రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా విలువైన ప్రభుత్వ భూములు కబ్జా గురవుతూ అక్రమార్కుల కబంధహస్తాల్లోకి వెళ్తున్నాయని బొల్లారం బిజెపి సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి ఆరోపించారు. బొల్లారం ఇండస్ట్రియల్ ఏరియాలోని ఇంపాక్ట్ మెటల్ పరిశ్రమ పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలానికి కొందరు అక్రమార్కులు కబ్జా చేస్తున్నారని ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విలువైన భూములు కబ్జా కోరలు ఏదేచ్ఛగా కబ్జాచేస్తూ సొమ్ము చేసుకుంటున్నా రక్షించాల్సిన ఆ శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రెవిన్యూ, జిహెచ్ఎంసి అధికారులు కబ్జాకోరులకు తొత్తులుగా మారి ప్రభుత్వంలో భూములు వారి కబంధ హస్తాల్లోకి వెళ్లేందుకు పరోక్షంగా సహకరిస్తున్నరన్నారు. కబ్జా కోరలకు సహకరించకుంటే అక్కడ నిర్మించిన నిర్మాణానికి హౌస్ నెంబర్ ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. రెవిన్యూ జిహెచ్ఎంసి అధికారులు పూర్తి విచారణ జరిపి ప్రభుత్వ భూమి కబ్జా కోరుల చెర నుంచి పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

వార్షిక తనిఖీలో భాగంగా ధర్మసాగర్ పోలీస్ స్టేషన్లో సందర్శించిన ఏసిపి ప్రశాంత్ రెడ్డి



ధర్మసాగర్ నవంబర్ 14 నమస్తే హైదరాబాద్ : వార్షిక తనిఖీలో భాగంగా ఏసీపీ, కాజీపేట ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులను, క్రైమ్ రేటును క్షుణ్ణంగా పరిశీలించి, పోలీస్ స్టేషన్ పనితీరును సమీక్షించారు.

అనంతరం పోలీస్ సిబ్బందితో సమావేశమై, సీఐ,ఎస్ఐ మరియు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ప్రస్తుతం సమాజాన్ని పట్టిపీడిస్తున్న గంజాయి అక్రమ రవాణా మరియు వినియోగం, సైబర్ నేరాలు సిబ్బంది వారి వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని మరియు అసాంఘిక కార్యకలాపాల పట్ల ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందిస్తూ పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంపొందించే విధంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.

నమస్తే హైదరాబాద్
మీ గళం.. మా కలం...!
NAMASTHE HYDERABAD
తెలుగు దిన పత్రిక
RNI No: APTEL/2012/45237

లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

★ విద్యార్థులను ఉత్సాహపరిచిన ఉపాధ్యాయులు, సిబ్బంది సాంస్కృతిక ప్రదర్శనలు





ఉప్పల్, నవంబర్ 14 (నమస్తే హైదరాబాద్):భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెవరెండ్ బ్రదర్ డాక్టర్ జోసఫ్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఈ వేడుకలు విద్యార్థుల్లో ఆనందోత్సాహాలను నింపాయి.ఈ కార్యక్రమానికి థాయిలాండ్‌లోని సెయింట్ గాబ్రియేల్ పాఠశాలకు చెందిన గౌరవ అతిథి రెవరెండ్ బ్రదర్ నికోలస్ ఫిరానంత్, ఆయన సమన్వయకర్త నటయా ఫోన్యాడెట్ ముఖ్య అతిథులుగా హాజరై వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పాఠశాల విద్యా సమన్వయకర్తలు మైథిలి, సుష్మ, లక్ష్మి, బాలుర ప్రతినిధి మాస్టర్ సేహార్ష్, బాలికల ప్రతినిధి కుమారి భావన తదితరులు పాల్గొన్నారు.

తొలుత ప్రార్థనా గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించి, జ్యోతి ప్రజ్వలన నిర్వహించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు రెవరెండ్ బ్రదర్ డాక్టర్ జోసఫ్ మాట్లాడుతూ బాలలే దేశ భవిష్యత్తు అని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సృజనాత్మకతను అలవర్చుకోవాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు.బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయులు, పాఠశాల సహాయక సిబ్బంది విద్యార్థుల కోసం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు, వినోదభరిత ప్రదర్శనలు నిర్వహించారు. ఉపాధ్యాయుల ప్రదర్శనలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకోగా, పాఠశాల ప్రాంగణం ఆనందోత్సాహాలతో సందడిగా మారింది.ఈ వేడుకలు విద్యార్థుల్లో సంతోషాన్ని నింపడమే కాకుండా పాఠశాల కుటుంబ సభ్యులందరూ ఒకచోట చేరి బాలల పట్ల తమ ప్రేమాభిమానాలను చాటుకునే ఆత్మీయ వేడుకగా నిలిచాయి. చివరగా జాతీయ గీతాలాపనతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

నెహ్రూ జయంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



★ చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, / సయ్యద్ జహీర్ / నవంబర్ 14 (నమస్తే హైదరాబాద్):
భారతదేశ తొలి ప్రధానమంత్రి, స్వర్గీయ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని శనివారం సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. పిల్లలే దేశ భవిష్యత్తుకు పునాదులని, వారి అభిరుచులు, ఆశయాలకు తగిన ప్రోత్సాహం అందిస్తూ విద్య, ఆరోగ్యం, సంక్షేమానికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని ఆకాంక్షించారు. బాలలలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారు ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్‌తో పాటు మున్సిపల్‌సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సభకు సర్వం సిద్ధం చేయాలి.. పనులు వేగవంతం చేయాలి..

★ 16 ఎకరాల విస్తీర్ణంలో భారీ బహిరంగ సభ ప్రాంగణం

★ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ కట్టా హైమావతి

★ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

★ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, / సయ్యద్ జహీర్ / నవంబర్ 14 (నమస్తే హైదరాబాద్):ఈ నెల 19వ తేదీన సిద్దిపేట జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు సంబంధించి ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సభను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి సభా ప్రాంగణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు. జిల్లా కేంద్రంలోని నాగదేవత ఆలయం ఎదుట, నందాల వెంకటలక్ష్మి గార్డెన్ వెనుక భాగంలో బైపాస్ రోడ్డు, చిన్నగుండవెల్లి రోడ్డుకు ఆనుకుని సుమారు 16 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభ ప్రాంగణాన్ని కలెక్టర్ పరిశీలించారు. ట్రాక్టర్లు, డోజర్ల సహాయంతో ప్రాంగణాన్ని చదును చేసే పనులు వేగంగా కొనసాగుతున్నాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సభా ప్రాంగణాన్ని పూర్తిస్థాయిలో చదును చేసి, అన్ని ఏర్పాట్లకు అనువుగా తీర్చిదిద్దాలని సూచించారు. లెవెలింగ్ పనుల్లో నాణ్యతతో పాటు వేగానికి ప్రాధాన్యత ఇవ్వాలని, చేపట్టిన పనులన్నింటినీ ఆదివారంలోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పాల్గొనే భారీ బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రతి విభాగం సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. సభా వేదిక, వీవీఐపీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధులు, సామాన్య ప్రజల కోసం ప్రత్యేక ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా వీఐపీలు, ప్రజాప్రతినిధులు, అధికారుల వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలను కేటాయించాలని, ట్రాఫిక్ నియంత్రణ, పోలీసు బందోబస్తు విషయంలో సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రజల రాకపోకలకు ఆటంకాలు కలగకుండా అవసరమైన మార్గదర్శకాలు సిద్ధం చేయాలన్నారు. ప్రత్యేక గ్యాలరీలు, బారికేడ్ల ఏర్పాటు, నిరంతర విద్యుత్ సరఫరా వంటి అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, పనుల్లో జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో సిద్దిపేట ఆర్డీవో సదానందం, తహసీల్దార్ కిరణ్, పోలీసు శాఖ అధికారులు, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, విద్యుత్ శాఖల అధికారులు, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితురాలికి అండగా కల్వకుంట్ల వంశీధర్ రావు



★ దగ్ధమైన కిరాణా దుకాణం పునర్నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తానని భరోసా

★ ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబానికి అండగా నిలిచి మానవత్వం చాటుకున్న వంశీధర్ రావు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, / సయ్యద్ జహీర్ / నవంబర్ 14 (నమస్తే హైదరాబాద్):
సిద్దిపేట పట్టణంలోని 1వ వార్డు లింగారెడ్డి పల్లిలో జీవనోపాధి కోసం చిన్నపాటి కిరాణా దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న బొల్లు శివానికి దీపావళి పండుగ రోజు తీవ్ర విషాదం ఎదురైంది. హనుమాన్ ఆలయం సమీపంలో ఆమె నిర్వహిస్తున్న కిరాణా దుకాణంలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించి షాపు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో దుకాణంలోని సరుకులు, ఇతర సామగ్రి మొత్తం అగ్నికి ఆహుతి కావడంతో సుమారు రూ.3 లక్షల మేర ఆర్థిక నష్టం వాటిల్లింది. దీంతో జీవనోపాధి కోల్పోయి ఆమె కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైంది. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, కేవీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్ రావు వెంటనే స్పందించి సంఘటన స్థలానికి శనివారం చేరుకుని అగ్నిప్రమాదంలో దగ్ధమైన కిరాణా దుకాణాన్ని పరిశీలించారు. బాధితురాలు బొల్లు శివానిని పరామర్శించి ప్రమాదం జరిగిన తీరును, జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ధైర్యం చెబుతూ జీవనోపాధికి ఆధారమైన దుకాణం అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోవడం బాధాకరమని అన్నారు. అయితే అధైర్యపడవద్దని, తిరిగి దుకాణాన్ని పునర్నిర్మించుకుని వ్యాపారం కొనసాగించేందుకు అవసరమైన పూర్తి సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని చాటుతూ, జీవనాధారాన్ని కోల్పోయిన బాధితురాలికి భరోసా కల్పించడం స్థానికంగా పలువురి ప్రశంసలు అందుకుంది. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచిన కల్వకుంట్ల వంశీధర్ రావు చొరవ పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

కాకతీయ పాఠశాలలో ఘనంగా జాతీయ బాలల దినోత్సవ వేడుకలు

★ మహనీయుల అడుగుజాడల్లో నడిచి సమాజానికి దిశానిర్దేశకులుగా ఎదగాలి

★ బిస్మాట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, / సయ్యద్ జహీర్ / నవంబర్ 14 (నమస్తే హైదరాబాద్):భావిభారత పౌరులైన చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీస్తూ, వారిలో దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, సేవాభావాన్ని పెంపొందించే లక్ష్యంతో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కాకతీయ హైస్కూల్‌లో జాతీయ బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారతదేశ తొలి ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకలకు బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (బిస్మాట్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలే దేశ భవిష్యత్తుకు పునాదులని, నేటి విద్యార్థులే రేపటి సమాజ నిర్మాణకర్తలని పేర్కొన్నారు. చిన్ననాటి నుంచే విద్యార్థులు మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని, వారి అడుగుజాడల్లో పయనించాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నిరంతర విద్యాభ్యాసంతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. కేవలం చదువులోనే కాకుండా నైతిక విలువలు, సామాజిక బాధ్యత, మానవతా దృక్పథంలోనూ రాణిస్తూ సమాజానికి దిశానిర్దేశం చేసే గొప్ప వ్యక్తులుగా ఎదగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు వివిధ జాతీయ నాయకులు, మహనీయుల వేషధారణలతో అలరించారు. రంగురంగుల సంప్రదాయ దుస్తులు, ఆకట్టుకునే వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. చిన్నారుల ప్రతిభ, చురుకుదనం, అభినయ నైపుణ్యం సభికులను విశేషంగా ఆకట్టుకోగా, పలువురు విద్యార్థుల ప్రదర్శనలు ప్రత్యేక ప్రశంసలు అందుకున్నాయి. ఈ సందర్భంగా వేషధారణ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన చిన్నారులను జగ్గు మల్లారెడ్డి అభినందించి, బహుమతులు అందజేశారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కవిత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



★ సభా ప్రాంగణ పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

★ నవంబర్ 19న సీఎం రేవంత్ రెడ్డి సిద్దిపేట పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, / సయ్యద్ జహీర్ / నవంబర్ 14 (నమస్తే హైదరాబాద్):
ఈ నెల 19వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో సభా ప్రాంగణం వద్ద చేపడుతున్న ఏర్పాట్లు, అభివృద్ధి పనులపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో శనివారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ సభా వేదిక వద్ద కొనసాగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన పనులను నాణ్యతతో, నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. సభా ప్రాంగణం పరిసరాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ అన్ని ఏర్పాట్లు సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వేలేరు గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన బాలల గ్రామసభ





వేలేరు నవంబర్ 14 నమస్తే హైదరాబాదు :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వేలేరు మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బిల్లా యాదగిరి అధ్యక్షతన బాలల గ్రామసభ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సర్పంచ్ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథులుగా కాజీపేట ఏసిఎప్రశాంత్ రెడ్డి మరియు ధర్మసాగర్ సిఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వేలేరు మండల ఎస్సై దూదిమెట్ల నరేష్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ూజూ, సర్పంచ్ మాట్లాడినారు, మరియు ూజూ ప్రశాంత్ రెడ్డి విద్యార్థులకు అమూల్యమైన సందేశాన్ని ఇవ్వడం జరిగింది, మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని విద్యార్థుల చదువు కోసం తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను వివరిస్తూ తల్లిదండ్రుల మాటలను ఉపాధ్యాయులను మాటలను గౌరవిస్తూ బాగా చదువుకొని ఉన్నత స్థాయి ఉద్యోగాలు చేయాలని విద్యార్థులకు తెలియజేసినరు,జ× మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకోవాలని మరియు సమాజంలో జరుగుతున్న చెడు సంఘటనల గురించి వివరిస్తూ, సోషల్ మీడియా, మొబైల్ ఫోన్ గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించడం జరిగింది. సర్పంచ్ మాట్లాడుతూ భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ గారి జయంతిని పురస్కరించుకొని జాతీయ బాలల దినోత్సవం జరుపుకుంటున్నామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బాలల గ్రామసభను ఏర్పాటుచేసి పిల్లలతోని మాట్లాడించి వారి ఎదుర్కొంటున్న సమస్యల గురించి మరియు పాఠశాలలో కావలసినటువంటి అభివృద్ధి పనుల గురించి తెలుసుకొని వాటి పరిష్కారానికై గ్రామపంచాయతీ నిధులను కూడా కేటాయించడం జరుగుతుంది, అదేవిధంగా ఒక సర్పంచ్ గా పిల్లలందరికీ నాణ్యమైన విద్య మెరుగైన ,పాఠశాల వసతులు, క్రీడలకు సౌకర్యం ,అందివ్వడం నా యొక్క బాధ్యత, ఏ ఒక్క చిన్నారి కూడా పేదరికంలో చదువుకు దూరం కాకూడదని లక్ష్యంతో ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుంది, నేటి బాలలే రేపటి పౌరులు కాబట్టి పిల్లల సంక్షేమం కోసం ప్రత్యేక శ్రద్ధ వేయించడం జరుగుతుంది, ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం పెద్ద మొత్తంలో నిధులను మంజూరు చేసి పాఠశాలలను అభివృద్ధి చేయడం జరిగిందని, ఈ సందర్భంగా చిన్నారులందరికీ హృదయపూర్వక బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ బాలల గ్రామసభ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకర్ , జిపి కార్యదర్శి విజయ జెడ్పి హెచ్ఎం సత్యం , లీలా బాయ్ సీసీ రమాదేవి, వార్డు సభ్యులు సంధ్యమౌనిక, పర్వీన్ ,సురేష్ ,సునీల్ ,గార్లు, ఉపాధ్యాయులు,ఎూం అధ్యక్షులు,జూం, అంగన్వాడీ టీచర్స్, మరియు పెద్ద సంఖ్యలో 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు

నమస్తే హైదరాబాద్
మీ గళం.. మా కలం...!
NAMASTHE HYDERABAD
తెలుగు దిన పత్రిక
RNI No: APTEL/2012/45237

పేదింటి ఆడబిడ్డల ఉన్నత చదువులకు హెచ్ఏఎల్ చేయూత

★బాచుపల్లిలో గురుకుల బాలికల డిగ్రీ కళాశాల నూతన భవనం ప్రారంభం

★విద్యతోనే పేదరికంపై విజయం.. ప్రపంచస్థాయి నైపుణ్యాలు అందించాలి

★ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్





మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బాచుపల్లి, (నమస్తే హైదరాబాద్) : పేదింటి ఆడబిడ్డల కలలకు విద్యతో రెక్కలు తొడిగే బృహత్తర కార్యక్రమానికి హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) శ్రీకారం చుట్టింది. సంస్థ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో బాచుపల్లిలో నిర్మించిన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, డిగ్రీ కళాశాల నూతన భవనాన్ని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదరికం ప్రతిభకు అడ్డుకాకూడదని, నాణ్యమైన విద్యతోనే జీవితాల్లో శాశ్వత మార్పు సాధ్యమని పేర్కొన్నారు.

● 760 మంది బాలికలకు బంగారు భవిష్యత్తు .....

ఈ విద్యాసంస్థ ద్వారా సుమారు 760 మంది బాలిక లకు ఆరో తరగతి నుంచి డిగ్రీ వరకు ఒకే ప్రాంగణంలో నాణ్య మైన విద్య, వసతి సౌకర్యాలు అందించడం అభినంద నీయ మన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అణగారిన వర్గాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు కృషి చేస్తోందన్నారు. డేటా సైన్స్, బిజినెస్ అనలిటిక్స్ వంటి ఆధునిక కోర్సులతోపాటు కోడింగ్, డిజిటల్ నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వడం విద్యార్థినులకు భవిష్యత్తులో విస్తృత అవకాశాలను కల్పిస్తుందని చెప్పారు.

విద్యార్థినులు ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలి... ..... హెచ్ఏఎల్ నిర్మించే విమానాలు దేశాన్ని ఆకాశంలో ఎగరేస్తే.. ఈ విద్యాసంస్థ పేదింటి ఆడబిడ్డల ఆశయాలను ఉన్నత శిఖరా లకు చేరుస్తుందని మంత్రి అన్నారు. విద్యార్థినులు ఐఏఎస్ అధి కా రులు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, పారిశ్రా మిక వేత్త లుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఉద్యోగాల కోసం ఎదురు చూసే స్థాయి నుంచి ఇతరులకు ఉద్యోగాలు కల్పించే స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. విద్యతోపాటు వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేలా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

● ఎవరెస్టును అధిరోహించిన గురుకుల విద్యార్థిని .....

గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి గుగులోతు రవి,ఐ ఐఏఎస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ భారీగా నిధులు ఖర్చు చేస్తోందన్నారు. గురుకుల విద్యార్థిని మాలావత్ పూర్ణ ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించడం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని గుర్తుచేశారు. బాలికల విద్యాభివృద్ధికి హెచ్ఏఎల్ అందించిన సహకారాన్ని అభినందించారు. మంత్రి ప్రస్థానం స్ఫూర్తిదాయకం..... కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ మాట్లాడుతూ.. పేదరికం నుంచి ఎన్నో కష్టాలను అధిగమించి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ క్యాబినెట్ హోదాకు ఎదగడం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కళాశాలలో చదివే విద్యార్థినులు ఉన్నత స్థానాలకు చేరుకుని దేశ, సమాజ అభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు.

● విద్యే శాశ్వత సంపద హెచ్ఏఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. రవి

మాట్లాడుతూ.. పేద విద్యార్థినుల విద్యాభివృద్ధికి భవన నిర్మాణంలో భాగస్వాములు కావడం తమ సంస్థకు గర్వకారణమన్నారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించి, ఉత్తమ సమాజ నిర్మాణానికి తోడ్పడాలని ఉపాధ్యాయులకు సూ చించారు. విద్య జీవితానికి అందించే అత్యంత విలువైన, శాశ్వ తమైన సంపద అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్ఏ ఎల్ డైరెక్టర్ (హెచ్ఆర్) డాక్టర్ ఎం.జి. బాలసుబ్రహ్మణ్యం, డైరెక్టర్ (ఫైనాన్స్) అండ్ సీఎఫ్ఓ డాక్టర్ బరేన్య సేనాపతి, డైరెక్టర్ (ఇం జినీరింగ్ అండ్ ఆర్ అండ్ డీ) అజయ్ కుమార్ శ్రీవాస్తవ, డైరె క్టర్ (ఆపరేషన్స్) పి.బి. రంగారావు, జీఎం (హెచ్ఆర్) ఎస్. ఎస్. చాందేల్, ఏవీ మురళీకృష్ణ (ఏడీ), ఉమా ఎన్. రావు (చీఫ్ ఆఫ్ ప్రాజెక్ట్స్), చీఫ్ మేనేజర్ సత్యనారాయణ, ఎస్సీ అభివృద్ధి శాఖ వీసీ అండ్ ఎండీ మల్లయ్య భట్టు, మంత్రి ఓ ఎస్ డి వై. జె .విజ య్ కుమార్ , ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్, జాయింట్ సెక్రటరీ సక్రు నాయక్, హెచ్ఏఎల్, గురుకుల సంస్థల అధికారులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్ టాలెంట్ స్కూల్లో ఘనంగా బాలల దినోత్సవం



★ విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

★ విజేతలకు బహుమతుల ప్రదానం

గజ్వేల్, / సయ్యద్ జహీర్ / నవంబర్ 14 (నమస్తే హైదరాబాద్): సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని సెయింట్ పీటర్స్ టాలెంట్ స్కూల్లో శనివారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల ఉపా ధ్యాయులు, ప్రిన్సిపాల్ ఫిలిక్స్ రజిని, కర స్పాండెంట్ సేవియర్ జ్యోతి బాలల హక్కులు, విద్య ప్రాముఖ్యత, బాలల భవిష్యత్తు, సమా జంలో వారి బాధ్యతల గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, డాన్సులు నిర్వహించగా, విద్యార్థులు జవహర్లాల్ నెహ్రూ, ప్రకృతి, పాఠశాల తదితర అంశాలపై ఆకట్టుకునే చిత్రాలు గీశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యా ర్థులకు చాక్లెట్లు పంపిణీ చేసి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ మా ట్లాడుతూ విద్యార్థులే రేపటి భారతదేశ భవిష్యత్తు అని, ప్రతి ఒక్కరిలోనూ ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, నిజాయితీ, సమయపాలన అలవ ర్చుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. పండిట్ జవహర్లాల్ నెహ్రూ ఆశయాలకు అనుగుణంగా మంచి పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సిపిఐ పార్టీ మేడిపల్లి మండల కౌన్సిల్ సమావేశం
బోడుప్పల్ సర్కిల్లో ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి



★ అన్ని డివిజన్లో సిపిఐ పార్టీ అభ్యర్థులను పోటీలో నిలబెడతాం

★సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

మేడిపల్లి (నమస్తే హైదరాబాద్): బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని ఇందిరానగర్ కాలనీ కమిటీ హాల్లో సిపిఐ పార్టీ మేడిపల్లి మండల కౌన్సిల్ సమావేశం రచ్చ కిషన్ అధ్వర్యంలో నిర్వహించబడింది. దండు రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఉమా మహేష్ మాట్లాడుతూ బోడుప్పల్ సర్కిల్ పరిధిలో రోడ్ల సమస్యలను పరిష్కరించాలని, పేరుకుపోయిన చెత్తను తొలగించి పారిశుద్ధ్య సమస్యను నివారించాలని డిమాండ్ చేశారు. అలాగే వీకర్ సెక్షన్ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని, మేడిపల్లి మండల లోని ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిపిఐ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని, రాబోయే ఎన్నికల్లో బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని అన్ని డివిజన్లలో సిపిఐ పార్టీ అభ్యర్థులను పోటీలో నిలబెడుతుందని స్పష్టం చేశారు.ప్రజల సమస్యలపై నిరంతరం ఉద్యమిస్తూ ప్రజలకు అండగా ఉంటామని నాయకులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ సహాయ కార్యదర్శి సిహెచ్ మాధవి, జి నాగరాజు, మండల కౌన్సిల్ సభ్యులు కే ప్రమీల, కే మహాలక్ష్మి, బాపు రాజు, భూతం ఐలయ్య, నర్సమ్మ, రమాతార మాచర్ల కన కయ్య, రచ్చ శ్యామ్, బి నాగమణి, దండు మ దర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బహదూర్ పల్లిలోఘనంగా బాలల దినోత్సవం వేడుకలు





మేడ్చల్ జిల్లా (నమస్తే హైదరాబాద్) : బాలల దినోత్సవం పురస్కరించుకొని బహదూర్ పల్లి ఆన్సర్ కుటుంబం చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్ లో శనివారం బాల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది ఇందులో భాగంగా బాలల హక్కుల పరి రక్షణే లక్ష్యం -- మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా మహిళా, శిశు సం క్షేమ శాఖ ఆధ్వర్యంలో నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు బాలల దినోత్సవ వారోత్సవాలను నిర్వహించడం జరు గుతుంది. ఈ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారి శారద ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి శారద మాట్లాడుతూ, బాలల హక్కులు గురించి, ప్రతి చిన్నారికి విద్య, ఆరోగ్యం, పోషకాహారం, రక్షణ, సమాన అవకాశాలు కల్పించడం మనందరి బాధ్యత అని తెలిపారు. బాల్యవివాహాలు, బాల కార్మికత్వం, బాలలపై జరిగే హింస, వేధింపులను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.బాలల రక్షణ కోసం చైల్డ్ హెల్ప్లైన్ 1098 నంబర్ను ప్రజలు వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.బాలలే భావి భారత పౌరులు. ప్రతి బాలుడికి హక్కులు, ప్రతి బాలికకు భద్రత, ప్రతి చిన్నారికి సమాన అవకాశాలు కల్పిద్దాం. బాలల హక్కులను గౌరవిద్దాం -- బాలల భవిష్యత్తును కాపాడుదాం."వివిధ బాలల సంరక్షణ సంస్థల చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని నృత్యాలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక ప్రదర్శనలతో అందరినీ అలరించారు. అనంతరం అధికారులు, చిన్నారుల సమక్షంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారుఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి ఇంతియాజ్ రహీం, జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్పర్సన్ రాజారెడ్డి, సభ్యులు రామ్మోహన్, నాగజయశ్రీ, కుత్బుల్లాపూర్ సిడిపిఓ రేణుక, అల్వాల్ సిడిపిఓ స్వాతి, ఆన్సర్ కుటుంబం చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్ మేనేజింగ్ డైరెక్టర్ సూర్య రావు, దుండిగల్ పోలీస్ స్టేషన్ ఎస్సై సరళ, జిల్లా బాలల పరిరక్షణ సిబ్బంది, సాధన సంస్థ, వివిధ సంస్థల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చలి తీవ్రత పెరుగుతోంది..
ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..



★ దుబ్బాక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్

దుబ్బాక, / సయ్యద్ జహీర్ / నవంబర్ 14 (నమస్తే హైదరాబాద్): పెరుగుతున్న చలి తీవ్రత దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉం డాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని దుబ్బాక ప్రభుత్వ వంద పడకల ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్ సూచించారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. తెలంగాణ రాష్ట్రంలో చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతూ ప్రజలను వణికిస్తోంది. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల వ్యాప్తంగా ఉదయం వేళల్లో దట్టమైన పొగమంచు కమ్ముకుంటోంది. చెట్లు, గుట్టలు మంచు దుప్పటి కప్పుకున్నట్లుగా కనిపిస్తూ ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నప్పటికీ, చలి తీవ్రతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొగమంచు కారణంగా గ్రామాల్లో ఉదయం వేళ వీధి దీపాలను సైతం ఆలస్యంగా ఆర్పుతున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమరాజ్ సింగ్ స్థానిక మీడియాతో మాట్లాడుతూ చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యవ సరమైతేనే బయటకు రావాలని సూచించారు. ముఖ్యంగా ఆస్తమా, గుండె సంబంధిత వ్యాధు లతో బాధపడేవారు మరింత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. చలికాలంలో ప్రతి ఒక్కరూ గోరువెచ్చని నీటిని తాగాలని, వేడివేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని సూ చించారు. చలి నుంచి రక్షణ పొందేందుకు స్వెటర్లు, మంకీ క్యాప్స్ ధరించాలని, శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవాలని తెలిపారు. చిన్నారులు, వృద్ధులను చలి నుంచి కాపాడేందుకు కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ప్రజలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు ఎదురైనా దుబ్బాక ప్రభుత్వ వంద పడకల ఏరియా ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ హేమరాజ్ సింగ్ సూచించారు.

నెహ్రూ ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకం

★ దేశ నిర్మాణంలో ఆయన సేవలు చిరస్మరణీయం

★ సిద్దిపేటలో ఘనంగా పండిట్ జవహర్లాల్ నెహ్రూ జయంతి వేడుకలు

★ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, / సయ్యద్ జహీర్ / నవంబర్ 14 (నమస్తే హైదరాబాద్): భారతదేశ తొలి ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న పురస్కార గ్రహీత స్వర్గీయ పండిట్ జవహర్లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్క్ వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో నెహ్రూ పోషించిన కీలక పాత్రను, స్వాతంత్ర్యం అనంతరం ఆధునిక భారతదేశ నిర్మాణానికి ఆయన చేసిన విశేష కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. దేశాభివృద్ధికి విద్య, విజ్ఞానం, శాస్త్రసాంకేతిక రంగాలే పునాదులని విశ్వసించిన నెహ్రూ దూరదృష్టి నేటికీ దేశానికి మార్గదర్శకంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ముఖ్యంగా పిల్లలు, యువత దేశ భవిష్యత్తుకు పునాదు లని భావించిన ఆయన ఆశయాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదా యకమని తెలిపారు. నేటి యువత విద్య, క్రమశిక్షణ, సేవాభావంతో ముం దుకు సాగుతూ దేశాభివృద్ధిలో భాగస్వా ములు కావాలని ఆకాంక్షి ంచారు. దేశానికి నెహ్రూ అంది ంచిన సేవలు, ఆయన నెలకొల్పిన ఆదర్శాలు భారత చరిత్రలో చిరస్థా యిగా నిలిచిపో తాయని ఈ సందర్భంగా కొని యాడారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతి నిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని పండిట్ జవహర్లాల్ నెహ్రూకు ఘనంగా నివాళులర్పించారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



జనగాం జిల్లా దేవరుప్పుల(నమస్తే హైదరాబాద్): దేవరుప్పుల మండలం నిర్మల గ్రామానికి చెందిన కొత్త తనీష్ రెడ్డి బాలల దినోత్సవం భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జోహార్ లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా. ఈ స్వయం పరిపాలన దినోత్సవం ద్వారా మీరు ఉపాధ్యాయుల స్థానంలో నిలబడి పాఠాలు బోధించడం ప్రిన్సిపాల్ బాధ్యతలు నిర్వహించడం. పాఠశాల కార్యక్రమాలను నడిపించడం వంటి బాధ్యతలను నిర్వహించారు. ఇది కేవలం ఒక రోజు సరదా కార్యక్రమం మాత్రమే కాదు. ఇది మీలో నాయకత్వ లక్షణాలను. ఆత్మవిశ్వాసాన్ని బాధ్యత యాతమైన ప్రవర్తనను పెంపొందించే గొప్ప అవకాశం అని తెలిపారు.

మెడికల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం

జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే ఆనంద్



మేడ్చల్ జిల్లా (నమస్తే హైదరాబాద్): జిల్లాలో ప్రజలకు అందుతున్న వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగు పరచడంతో పాటు, అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు లక్ష్యాలకు అనుగుణంగా ఉండేలా వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ ఆదేశించారు.జిల్లాలోని మెడికల్ ఆఫీసర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాతా--శిశు ఆరోగ్యం, ఇమ్యునైజేషన్, ఎన్ సి డి, టీబి, మలేరియా--డెంగ్యూ నియంత్రణ, , ఆర్ బి ఎస్ కే, పి సి పి ఎన్ డి టి కుటుంబ సంక్షేమం, పల్లె దవాఖానాలు, ఏ బి హెచ్ ఎ/, ఏ బి ఏ ఎస్ ఆరోగ్య కార్యకలాపాల పోర్టల్‌లలో డేటా నమోదు, ఫీల్డ్ స్థాయి పర్యవేక్షణ తదితర కార్యక్రమాల అమలు, పురోగతిని డీఎంహెచ్ఓ సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రతి కార్యక్రమానికి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాల్సిన బాధ్యత సంబంధిత మెడికల్ ఆఫీసర్లదేనని స్పష్టం చేశారు. కేవలం రికార్డుల్లో పురోగతి చూపించడం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజలకు వాస్తవంగా సేవలు అందుతున్నాయా లేదా అన్నది నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు, సిబ్బంది హాజరు, మందుల లభ్యత, వ్యాక్సిన్ల నిర్వహణ, రికార్డుల నవీకరణ, లైన్ లిస్టుల నిర్వహణ, హైరిస్క్ కేసుల ఫాలోఅప్, డ్యూ లిస్ట్‌లు, డేటా ఎంట్రీ తదితర అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు.పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని, నివేదికలు సమయానికి సమర్పించాలని, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత పెంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారు, పనులను అలస్యం చేసే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని



డీఎంహెచ్ఓ స్పష్టం చేశారు.

ప్రతి మెడికల్ ఆఫీసర్ తన పరిధిలోని ఆరోగ్య కార్యక్రమాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, సమస్యలను గుర్తించి పరిష్కరించడంలో ముందుండాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే శాఖ యొక్క ప్రధాన లక్ష్యమని, ఆ లక్ష్య సాధనలో ఎలాంటి అలసత్వాన్నీ సహించబోమని డా. కె. ఆనంద్ స్పష్టం చేశారు.

కేసీఆర్ పెనుముప్పు నుంచి రక్షించారు..



హైదరాబాద్:కవితను పార్టీ నుంచి బహిష్కరించినందుకు కేసీఆర్‌కు బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. దుర్మార్గమైన దోపిడీ, పెనుముప్పు నుంచి రక్షించారని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి సౌజన్యంతో పాంచజన్యం ఎజెండాతో టీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేశారు, ఆధారాలు ప్రజల ముందు బయటపెడతానన్నారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలో అధికార పక్షం దోపిడీ నిరంతరంగా సాగుతోంది. ఎన్ని కేసులు పెట్టినా, ఇబ్బంది పెట్టినా బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.అధికార పక్షంపై దోపిడీ చేయాల్సిన కవిత... బీఆర్ఎస్ పార్టీని విమర్శిస్తున్నారు. తండ్రి కేసీఆర్‌తోపాటు కేటీఆర్, హరీశ్ రావును విమర్శిస్తున్నారు. కాంగ్రెస్ కు నాలుగో అనుబంధ సంస్థగా టీఆర్ఎస్, రేవంత్ రక్షణ సేనగా పనిచేస్తోంది. కేటీఆర్, హరీశ్ రావుపై నిత్యం గళమెత్తుతున్న టీఆర్ఎస్... కాంగ్రెస్‌కు అనుబంధ సంస్థ కాకపోతే మరేమిటి..? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూలాన్ని మరిచిపోయారు



హైదరాబాద్: మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, ఇతర బీఆర్ ఎస్ నాయకులతో కలిసి వికారాబాద్ పరిధిలోని మూసీ ప్రభావిత ప్రాంతంలో పర్యటించారు. అనంతరం సబితా ఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చాలా గొప్పగా చెబుతున్నరు.. మూసీని సుందరీకరణ చేస్తానని, మూసీలోకి మురికినీళ్లు రాకుండా చేస్తానని గత రెండు సంవత్సరాల నుంచి వింటూనే ఉన్నామని అన్నారు.. 50 వేల కోట్ల రూపాయలు పెట్టి మూసీని బాగు చేస్తాననే మాట మాట్లాడుతున్నడు.. మూసీ అనే ప్రస్తావన వచ్చినప్పుడల్లా ఖచ్చితంగా వికారాబాద్‌ను గుర్తు చేసుకుంటం. వికారాబాద్‌లో పుట్టిన మూసీ కలుషితమైపోయి కిందంతా మురికినీళ్లు పారుతున్నయని మాట్లాడుతున్న సందర్భంలో వికారాబాద్‌లో ఉన్న రిపేర్ చేయాల్సిన బాధ్యత ఉందని.. ఉన్నవాళ్లు కానీ, ముఖ్యమంత్రి ప్రభుత్వంలో ఉన్నవాళ్లు ఎందుకు ఆలోచించడం లేదని సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు.

ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్య - నివారించేందుకు కూడళ్ల విస్తరణ!


హైదరాబాద్:ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యలను తగ్గించే లక్ష్యంతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కూడళ్ల విస్తరణకు శ్రీకారం చుట్టింది. అధిక ట్రాఫిక్ ఉన్న కూడళ్లను గుర్తించి ట్రాఫిక్ పోలీసుల సమన్వయంతో ఫ్రీ లెఫ్ట్, లేన్ మార్కింగ్, ట్రాఫిక్ సిగ్నళ్ల ఏర్పాటు వంటి అభివృద్ధి పనులను చేపడుతోంది. సంబంధిత పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కమిషనర్ జి.సృజన ఆదేశించడంతో ఇంజినీరింగ్ విభాగం ఈ ప్రక్రియను ప్రారంభించింది. 6 నెలల్లో పనులు పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేస్తోంది.శాస్త్రీయంగా గచ్చిబౌలి కూడలి అభివృద్ధినగరంలో అత్యంత రద్దీగా ఉండే కూడళ్లలో గచ్చిబౌలి ఒకటి. రోడ్లను వెడల్పు చేసినా, ఫ్లైఓవర్లు నిర్మించినా ఈ కూడలి వద్ద రద్దీ తగ్గటం లేదు. ఈ నేపథ్యంలో కూడలిని



శాస్త్రీయంగా అభివృద్ధి చేయడానికి సీఎంసీ ఇంజినీరింగ్ విభాగం ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసింది. ప్రధాన మార్గాన్ని డివైడర్లతో వేరు చేస్తూ, ఫ్రీ లెఫ్ట్ రోడ్డును అభివృద్ధి చేసి ఇండికేటర్ల ద్వారా ఫ్రీ లెఫ్ట్ బోర్డులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కూడళ్ల వద్ద బస్సులు, ఆటోలు ఆగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోనున్నారు. పనులు టెండర్ దశలో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.వరద నిల్వకుండా ప్రణాళికలుగచ్చిబౌలి, ఖజాగూడ మైండ్‌స్పేస్ కూడళ్ల మధ్య ఉన్న బయో డైవర్సిటీ జంక్షన్‌ను 'టీ' చౌరస్తాగా అభివృద్ధి చేసి ఫ్రీ లెఫ్ట్?, సూచిక బోర్డుల ఏర్పాటుతో పాటు వరద నిల్వకుండా అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. బీహెచ్ఈఎల్జాతీయ రహదారి-65పై ఉన్న ఈ కూడలి వద్ద ఫ్లైఓవర్ నిర్మించినప్పటికీ, రద్దీ తలెత్తుతోంది. వివిధ రహదారులపై వాహనాల సైన్‌బోర్డులు, లేన్ మార్కింగ్‌లు, డివైడర్లను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. మరో ఐదు కూడళ్లలోనూహైదరాబాద్?లోని కుత్బుల్లాపూర్, జేఎన్‌టీయూ, నర్సాపూర్ కూడళ్ల అభివృద్ధికి సంబంధించిన ప్రక్రియ ప్రస్తుతం టెండరు దశలో ఉంది. కోకాపేట్, నల్లగండ్ల కూడళ్లలో పనులు పురోగతిలో ఉన్నాయి. మొదటి దశలోని 8 కూడళ్ల పనులు పూర్తికాకముందే రెండో దశ కూడళ్ల అభివృద్ధికి సంబంధించిన డిజైన్లను పూర్తి చేసి టెండర్లు పిలుస్తామని క్రమ ంగా 72 చౌరస్తాలను ట్రాఫిక్ సమస్యలు లేకుం డా తీర్చిదిద్దుతామని సీఎంసీ వెల్లడించింది.

ఓయూలో యువ మేధస్సు - 88 బృందాలతో 'అన్వేషణ్-2026' సదస్సు

హైదరాబాద్ :ఉస్మానియా విశ్వవిద్యాలయం మరో అరుదైన ఘట్టానికి వేదికైంది. యువ విద్యార్థుల్లోని పరిశోధనా ప్రతిభను వెలికితీసేందుకు అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ సహకారంతో నిర్వహిస్తున్న 'అన్వేషణ్-2026' ఘనంగా జరిగింది. ఈ సదస్సులో దక్షిణాది రాష్ట్రాల నుంచి వచ్చిన యువ శాస్త్రవేత్తలు తమ వినూత్న ఆవిష్కరణలను ప్రదర్శించారు. సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు చూపే ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయి.మరో అరుదైన ఘట్టానికి వేదికగా ఓయూ క్యాంపస్‌విద్యార్థుల మేధస్సుకు పదును పెడుతూ, సమాజ సమస్యలకు పరిష్కారాలు చూపే అరుదైన ఆవిష్కరణ ప్రదర్శనకు ఉస్మానియా యూనివర్సిటీ వేదికైంది. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'అన్వేషణ్-2026' సౌత్ జోన్ సదస్సు ఘనంగా ప్రారంభమైంది.ఈ ప్రదర్శన కార్యక్రమానికి దక్షిణ భారత్‌లోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళం, తమిళనాడు నుంచి 88 బృందాల్లో 234 మంది విద్యార్థులు తమ పరిశోధన ప్రాజెక్టులను



ప్రదర్శించారు. బేసిక్ సైన్సెస్, అగ్రికల్చర్ సైన్సెస్, సోషల్ సైన్సెస్, ఇంటర్ డిసిప్లీనరీ, ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ రోబోటిక్స్, హెల్త్ సైన్సెస్‌లో ప్రాజెక్టులను ప్రదర్శించారు.మేం ఉమెన్? సేఫ్టీ స్మార్ట్? వాచ్? కనుగొన్నాం. చిన్న పిల్లలు, కాలేజీ అమ్మాయిలు, ప్రతి ఒక్కరూ ఎలాంటి నెట్?వర్క్? లేకుండా ఈ వాచ్?ను యాక్సెస్? చేసుకోవచ్చు. వాచ్?లో ఉన్న ఒక బటన్? నొక్కితే చాలు దగ్గరలోని పోలీస్? స్టేషన్?కు, తల్లిదండ్రులకు వారు ఎక్కడున్నారో సమాచారం వెళుతుంది. - విద్యార్థిని ఆధునిక సాంకేతికతతో సరికొత్త పరికరాల ఆవిష్కరణ ఆయా విభాగాల కు చెందిన విద్యార్థులు సమస్యలకు పరిష్కారాలు చూపేలా వీటిని రూపొందించారు. మేధస్సుకు పదును పెట్టి సాంకేతికతను వినియోగించు కొని సరికొత్త పరికరాలను ఆవిష్కరించారు. వాటిని పీపీటీ రూపంలో న్యాయనిర్ణేతల ముందు ప్రదర్శించి వాటి పనితీరును వివరించారు. ఏ తరహా సమస్యకు తమ ఆవిష్కరణ పరిష్కారం చూపుతుంది. తాము దానిని ఎలా రూపొందించాము. అనే వివరాలను వివరిస్తున్నారు. ఇదే క్రమంలో న్యాయనిర్ణేతలు సైతం విద్యార్థుల ఆవిష్కరణలపై సూచనలు, సలహాలు అందించారు.మోకాళ్ల నొప్పులతో మెట్లు ఎక్కేవారికి రక్షణ కవచంవిద్యార్థి దశలోని ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టిన వీరు ఆయా రంగాల్లోని సమస్యలు గుర్తించి వాటికి పరిష్కారం చూపేలా ప్రత్యేక పరికరాలు రూపొందించారు. వాటిల్లో మోకాళ్ల నొప్పులతో మెట్లు ఎక్కేవారికి రక్షణ కవచంతో పాటు శీతల పానీయాల్లో మత్తుమందును కనిపెట్టే కోడిగుడ్డు పెంకు, ఆసుపత్రుల్లోని బయో వ్యర్థాలను వేరు చేసే చెయ్యి ఇలాంటి వినూత్న ఆవిష్కరణను ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు రూపొందించారు. ప్రయోగాత్మకంగా వీటిని పరిశీలించిన అనంతరం వాటి ప్రాముఖ్యతలను వివరిస్తున్నారు.పంట పొలంలోకి జంతువులు వచ్చి దూరితే, పంట నాశనం అవుతుంది. ఇలా కాకుండా ఉండేందుకు ఇప్పటి వరకు చాలా మంది దీనిపై ఆవిష్కరణలు చేశారు. మేం ఈ సమస్యకు డ్యుయల్ డిటెక్షన్ సిస్టమ్?ను కనుగొన్నాం. - విద్యార్థినిదక్షిణాది రాష్ట్రాల నుంచి 88 బృందాలుగా వచ్చిన విద్యార్థుల ఆవిష్కరణల్లో ఉత్తమమైనవి ఎంపిక చేసి బహుమానం అందిస్తారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన విజేతలు జాతీయ స్థాయి అన్వేషణ్ సదస్సులో దక్షిణ భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు.

పోచారంలో కల్తీ పాల తయారీ కేంద్రంపై పోలీసుల దాడి.. వ్యాపారి అరెస్ట్



హైదరాబాద్:నగరంలో కల్తీ పాలు సరఫరా చేస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఇబ్రహీంపట్నం మండలం పోచారంలోని పాల తయారీ కేంద్రంపై సోమవారం అధికారులతో కలిసి పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భ ంగా భారీగా కల్తీ పాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పాల వ్యాపారిని అరెస్ట్ చేశారు. పాల తయారీ కేంద్రంలోని యంత్రాలను సీజ్ చేశారు.పాల వ్యాపారిని ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. హైడ్రోజన్ పెరాక్సైడ్‌ను వినియోగించి.. ఈ కల్తీ పాలను తయారు చేస్తున్నట్లు తమ విచారణలో పాల వ్యాపారి వెల్లడించారని పోలీసులు తెలిపారు. ఈ కల్తీ పాలను హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో సరఫరా చేస్తున్నట్లు వెల్లడించాడని పోలీసులు చెప్పారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ నుంచి నీళ్లు ఎలా పోతున్నాయో చూడండి.



హైదరాబాద్ :కాంగ్రెస్ సర్కార్ పాలనలో తాగునీటి కష్టాలు ఎలా ఉన్నాయో తెలిపే దృశ్యాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ రోజూ ఎక్కడో చోట వెలుగులోకి వస్తున్నాయని తెలిసిందే. ఇప్పటికే హైదరాబాద్, కరీంనగర్, సంగారెడ్డి, నారాయణతో పాటు పలు జిల్లాల్లో తాగునీటి కోసం ప్రజలు రోడ్డెక్కిన ఘటనలు కనిపిస్తూనే ఉన్నాయి.ఇదిలా ఉంటే ఇప్పటికే సంగారెడ్డి పట్టణంలో పలు కాలనీల వాసులు తాగునీటి డ్రమ్ములు, ఖాళీ బిందెలతో వాటర్ ట్యాంకర్ల దగ్గర క్యూలైన్లు కట్టిన ఫొటోలు నెట్టింట రౌండప్ చేస్తున్నాయి. అయితే తాగునీటితో జనాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మరోవైపు మిషన్ భగీరథ అధికారులు మాత్రం మిషన్ భగీరథ నీళ్లు వృథాగా పోతున్నా ఇవేవీ పట్టనట్టుగా చోద్యం చూస్తున్నారు.సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట నుంచి రాయపాడు మార్గంలో రోడ్డు పక్కనే ఉన్న మిషన్ భగీరథ పైప్‌లైన్ గేట్‌వాల్ నుంచి నీళ్లు లీకై భారీ ఎత్తున పైకి చిమ్ముతున్నాయి. మెయిన్ రోడ్డు వెంబడి నీటి సరఫరా పైప్ లైన్ నుంచి విచ్చలవిడిగా నీళ్లు వృథాగా పోతున్నా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంపై నెటిజన్లు, ప్రజలు మండిపడుతున్నారు. నీళ్లు వృథా చేస్తే సామాన్య ప్రజలకు జరిమానా విధిస్తారు కానీ ప్రభుత్వానికి ఎలాంటి రూల్స్ ఉండవా అంటూ అధికారులు, ప్రభుత్వ యంత్రాంగంపై ఫైర్ అవుతున్నారు.

జైళ్ల సంస్కరణల్లో మరో కీలక మైలురాయి - చర్లపల్లి కారాగారంలో ప్రభుత్వ ఐటీఐ

హైదరాబాద్ :ఖైదీల నైపుణ్యాభివృద్ధి, పునరావాసం దిశగా తెలంగాణ జైళ్ల శాఖ కీలక అడుగు వేసింది. చర్లపల్లి కేంద్ర కారాగారంలో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)ను ఏర్పాటు చేసింది. జైళ్ల శాఖ పరిధిలో తొలిసారిగా ప్రభుత్వ ఐటీఐని ఏర్పాటు చేయడం విశేషం. దీని ద్వారా ఖైదీలు జైలు ప్రాంగణంలోనే గుర్తింపు పొందిన సాంకేతిక, వృత్తి విద్యా కోర్సులను అభ్యసించే అవకాశం కలుగుతుంది. జైళ్లను కేవలం నిర్బంధ కేంద్రాలుగా కాకుండా విద్య, నైపుణ్యాభివృద్ధి, పునరావాస కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్న శాఖ సంకల్పానికి ఈ కార్యక్రమం నిదర్శనం.భారత ప్రభుత్వ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్ 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి క్రాఫ్ట్స్‌మెన్ ట్రైనింగ్ స్కీమ్ కింద తొమ్మిది ప్రమాణాలకు అనుగుణమైన ట్రేడ్‌లకు



సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. ఒక్కో బ్యాచ్‌లో 200 మంది అభ్యర్థులకు శిక్షణ అందించేలా ప్రతిపాదించారు. ఆమోదం పొందిన కోర్సుల్లో ఫిట్టర్, పెయింటర్ (జనరల్), వీవింగ్ టెక్నీషియన్, వుడ్ వర్క్ టెక్నీషియన్, వెల్డర్, డ్రెస్ మేకింగ్, హౌస్ కీపర్, హార్టికల్చర్, ఫ్లోరికల్చర్ అండ్ ల్యాండ్‌స్కేపింగ్ ఉన్నాయి.జైళ్లో ప్రభుత్వ ఐటీఐ ఏర్పాటు నైపుణ్యాభివృద్ధి, పునరావాస కేంద్రాలుగా మార్చేందుకు ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని సీనియర్? ఐపీఎస్? అధికారి సౌమ్య మిశ్రా అన్నారు. ఇప్పటికే సుమారు 200 మంది ఖైదీలు ఐటీఐ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. వివిధ కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ అందించేందుకు తొమ్మిది మంది నైపుణ్యం కలిగిన శిక్షకులు అందుబాటులో ఉన్నారన్నారు. కోర్సులు అభ్యసిం చేలా ప్రోత్సహిస్తాంఖైదీలలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరిస్తూ, ఇటీవల నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ ఐఓఎస్) ద్వారా 78 మంది ఖైదీలు పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారని సౌమ్య మిశ్రా తెలిపారు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీతో ఎంఓయూ కుదుర్చుకున్న అనంతరం 70 మంది ఖైదీలు పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేరారని వెల్లడించారు. విద్యార్హతలు పూర్తి చేసే ఆసక్తి కలిగిన ఖైదీలను ఐటీఐ కోర్సులు అభ్యసించేలా ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. విద్యతోపాటు వృత్తి నైపుణ్య శిక్షణను అనుసంధానం చేయడం ద్వారా ఖైదీలకు విడుదల అనంతరం ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. వారు నైపుణ్యం, ఆత్మవిశ్వాసం, ఆర్థిక స్వావలంబన కలిగిన పౌరులుగా సమాజంలో తిరిగి స్థిరపడేందుకు దోహదపడుతుందని ఆమె వివరించారు.స్థిరమైన జీవనోపాధి అవకాశాలను కల్పించడంలో నైపుణ్యాభివృద్ధి, వృత్తి విద్య కీలక పాత్ర పోషిస్తాయని శక్తి శాఖ కార్యదర్శి దాసరి హరిచందన పేర్కొన్నారు. కావాలని ఉపాధి శిక్షణ శాఖ సంచాలకులు ఎ.క్రాంతి వెస్లీ సూచించారు.

అంతరిక్ష రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే కీలక గమ్యస్థానంగా తీర్చిదిద్దుతాం

అమరావతి:అంతరిక్ష రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే కీలక గమ్యస్థానంగా తీర్చిదిద్దుతామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. స్పేస్ ఎకానమీ చుట్టూ సమగ్ర ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. రాకెట్ విడిభాగాల తయారీ సంస్థలను అంతరిక్ష కంపెనీలతో అనుసంధానిస్తామని చెప్పారు. డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ స్పీడ్ ఏపీ తమ ప్రత్యేకతలని స్పష్టం చేశారు.'సీఐఐ భాగస్వామ్య సదస్సు కక్ష్య నుంచి అవకాశాల దిశగా భారతదేశ నూతన అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ' అంశంపై జరిగిన ప్రత్యేక చర్చలో నారా లోకేశ్ పాల్గొన్నారు. అంతరిక్ష రంగాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రధానంగా నియంత్రిస్తున్నప్పటికీ ఈ రంగంలో రాష్ట్ర ప్రభుత్వాలు కీలక పాత్ర పోషించగలవని వివరించారు. ముందుగా ఒక రంగాన్ని ఎంపిక చేసుకుని అందులో పనిచేస్తున్న సంస్థలు, భాగస్వాములను గుర్తించాలన్నారు. క్రమపద్ధతిలో పెట్టుబడులను ఆకర్షించి ఆయా కంపెనీలను రాష్ట్రానికి తీసుకురావడమే తమ విధానమని చెప్పారు. దీన్నే



వర్టికల్, హారిజాంటల్ ఇంటిగ్రేషన్‌గా అభివర్ణించారు.వర్టికల్ ఇంటిగ్రేషన్‌లో భాగంగా స్పేరూట్ వంటి సంస్థలకు అవసరమైన విడిభాగాలు, ఉప వ్యవస్థలను తయారుచేసే కంపెనీలను ఒకే వ్యవస్థలోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు లోకేశ్ తెలిపారు. వీటి ద్వారా రాకెట్ తయారీ, ప్రయోగాలకు అవసరమైన సహకారం అందుతుందన్నారు. హారిజాంటల్ ఇంటిగ్రేషన్‌లో విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య సమన్వయం కీలకమని చెప్పారు. అకడమిక్ కరిక్యుల మ్‌ను ఆధునీకరించడం, పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వడం అవసరమన్నారు. పరీక్షలు, సర్టిఫికేషన్ సదుపాయాల కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను అభివృద్ధి చేయాలని వివరించారు. ఇప్పటికే ఇంధన రంగంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఐఐటీ తిరుపతితో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. ఆ ప్రాంతంలో ఇంగాట్, సోలార్, వేఫర్, సెల్ తయారీ సంస్థలు ఏర్పాటవుతున్నాయని చెప్పారు.

అంతరిక్ష రంగానికి బలమైన పారిశ్రామిక పునాది : అంతరిక్ష పరిశ్రమలన్నింటినీ ఒకే వ్యవస్థలో అనుసంధానించే సమగ్ర విధానం దేశానికి అవసర మని మంత్రి లోకేశ్ అభిప్రాయపడ్డారు. స్పేస్ సిటీ అభివృద్ధికి కేంద్రం విధానపరమైన మార్గద ర్శకాలు రూపొందించాలని సూచించారు. అనం తరం రాష్ట్రాలు వేగంగా ముందుకెళ్లి స్పేరూట్ వంటి సంస్థలతో పాటు విడిభాగాల తయారీదా రులు, సరఫరాదారులను ఆకర్షించాలని చెప్పారు. ఈ రంగంలో సూక్ష్మ, చిన్న, మధ్యత రహా పరిశ్రమలకు విస్తృత అవకాశాలున్నాయని వివరించారు. ఇటీవల రాకెట్‌కు అవసరమైన షీల్డ్ తయారుచేసే ఒక ఎంఎస్ఎంఈ సంస్థను కలిశానని తెలిపారు. ఇలాంటి సంస్థలన్నింటినీ ఒకే ఎకోసిస్టమ్‌లోకి తీసుకురావడం ద్వారా అంతరిక్ష రంగానికి బలమైన పారిశ్రామిక పునాది ఏర్పడుతుందని చెప్పారు.ఏపీకి ప్రధాన బలం వేగంగా పనులు పూర్తి : కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్డీయే భాగస్వామ్య ప్రభుత్వాలు ఉండటం ఏపీకి అనుకూలమని లోకేశ్ తెలిపారు. రాష్ట్ర, దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని విధానాల్లో సానుకూల మార్పులకు కృషి చేసే అవకాశం ఉందన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీకి ఉన్న ప్రధాన బలం పనులను వేగంగా పూర్తి చేయడమేనని స్పష్టం చేశారు. యువత కెరీర్ అవకాశాల కోసం ఎదురుచూస్తోందని వారికి పరిశ్రమల ద్వారా అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

బెంగళూరు ప్యాలెస్ నుంచి ఏపీపై జగన్ కక్ష సాధిస్తున్నారు.. ఎంపీ కలిశెట్టి ధ్వజం



అమరావతి, నవంబరు 14 : వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తెలుగుదేశం పార్టీ విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రౌడీ మూకలను ప్రోత్సహించి, అల్లర్లు సృష్టించి ఎన్నికలను వాయిదా వేయాలని జగన్ రెడ్డి కుట్రలు పన్నారని ధ్వజమెత్తారు. (శనివారం) అమ రావతి వేదికగా మీడియాతో ఎంపీ కలిశెట్టి మాట్లాడారు. వైసీపీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో దౌర్జన్యాలు, అక్రమాలు జరిగాయని, ఇప్పుడు ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయని ప్రజలు హర్షిస్తు న్నారని చెప్పుకొచ్చారు. బెంగళూరు ప్యాలెస్‌లో జగన్ కూర్చొని ఏపీపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ, కుట్రలు చేస్తున్నారని ఆగ్రహి ంచారు.ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నా రు..తాడేపల్లి ప్యాలెస్‌కు చుట్టపు చూపుగా వచ్చి ప్రెస్‌మీట్లు పెడుతూ ప్రజలను జగన్ రెడ్డి గందరగోళానికి గురిచేస్తున్నారని ఎంపీ కలిశెట్టి దుయ్యబట్టారు. వైసీపీ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని.. భవిష్యత్తులో ఏ ఎన్నికలు జరిగినా ప్రజలు ఓటుతో జగన్ అండ్ కోకు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. విశాఖ పట్నంలో రెండు రోజుల పాటు జరిగిన సీఐఐ (సదస్సు సూపర్ హిట్ అయిందని తెలిపారు. 31వ సీఐఐ సదస్సు ద్వారా ఏపీకి రూ.9.89 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చామని వెల్లడించారు. సీఎం చంద్రబాబు నాయుడు విజన్, మంత్రి లోకేశ్ కార్యాచరణపై నమ్మకం తోనే ఏపీకి దేశ, విదేశీ పారిశ్రామికవేత్తలు తరలివచ్చారని ప్రస్తావించారు.పీ4 (గ్రా4) కార్యక్రమం ద్వారా పేదల అభ్యున్నతికి తాము కృషి చేస్తున్నామని ఎంపీ కలిశెట్టి తెలిపారు. సీఎస్ఆర్ నిధులతో పేద కుటుంబాలను ఆదుకునేలా కార్పొరేట్ సంస్థలు ముందడుగు వేస్తున్నాయని వెల్లడించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం ఎయిర్‌పోర్ట్, విశాఖపట్నం సదస్సులే గేట్‌వేనని చెప్పారు. జగన్ హయాంలోని ఐదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన ఉత్తరాంధ్రకు నేడు పూర్వ వైభవం తీసుకువచ్చామని వ్యాఖ్యానించారు.

ఏపీ బ్రాండ్‌తో పెట్టుబడుల వరద.. రాష్ట్రానికి రూ.32 లక్షల కోట్లు: ఎమ్మెల్యే గంటా



విశాఖపట్నం, నవంబర్ 14: సీఐఐ పెట్టుబడుల సదస్సు విజయవంతమైందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. (శనివారం) మీడియాతో మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు జరిగిన సదస్సులో రూ.9 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు చెప్పారు. రాష్ట్రానికి ఇప్పటి వరకు రూ.32 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని. ఇది ఏపీ బ్రాండ్‌కు నిదర్శనమన్నారు. చంద్రబాబు బ్రాండ్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ సహకారంతో ఈరోజు పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ముందంజలో ఉన్నామన్నారు.గతంలో పరిశ్రమలు ఇక్కడ నుంచి వెళ్లి పోయాయని.. అప్పట్లో కొత్త పరిశ్రమలు రాలేదని ఎమ్మెల్యే తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పెట్టుబడుల వరద కొనసాగుతోందన్నారు. రీజినల్ సమ్మిట్ ద్వారా ఇక్కడ ఉన్న పారిశ్రామికవేత్తలకు ప్రాధాన్యం కల్పిం చామని వివరించారు. పెట్టుబడులకు రక్షణ చట్టం తేవడం చాలా మంచి పరిణామమన్నారు. ఎస్క్రో అకౌంటు క్రియేట్ చేస్తున్నామని.. పెట్టుబడు లను ప్రభుత్వమే మానిటరింగ్ చేస్తున్నట్లు వెల్లడించారు.గతంలో పెట్టుబడులు ఇతర రాష్ట్రాలకు వెళ్లేవని.. ఇప్పుడు ఏపీకి వస్తున్నాయని గంటా అన్నారు. అందరి చూపు ఏపీ వైపే ఉందన్నారు. 2024 ఎన్నికల ఫలితాలు ఏకపక్షంగా వచ్చాయని.. ఇటీవల వెలువడిన ఫలితాల్లో వార్ వన్‌సైడ్‌గా కనిపించిందన్నారు. గతంలో ఎన్టీఆర్ కంటే ఎక్కువ స్ట్రైక్ రేట్ వచ్చిందని తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులు వచ్చినప్పటికీ ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. మంచి ప్రభుత్వం కాబట్టే ప్రజలు ఇలాంటి ఫలితాన్ని ఇచ్చారని.. గ్రామాల్లో కూడా క్లీన్ స్వీప్ చేస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ధీమా వ్యక్తం చేశారు.

వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో పెట్టుబడుల రక్షణ చట్టాన్ని తీసుకొస్తాం

అమరావతి :రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు నమోదు చేసుకుంటే వెంటనే పని ప్రారంభించేలా స్వీయ ధ్రువీకరణ విధానంలో అనుమతులిస్తామని నెలరోజుల్లో దీన్ని అందుబాటులోకి తెస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. 'పరిశ్రమలకు అనుమతుల్ని సులభతరం చేస్తున్నాం. అధికశాతం పరిశ్రమలకు 'డీమ్డ్ క్లాజ్' (అనుమతి లభించినట్లుగా భావించే నిబంధన) కింద స్వీయ ధ్రువీకరణతో కొన్ని అనుమతులు ఆటోమేటిక్‌గా ఇస్తాం. కొన్నింటికి నిపుణుల బృందాల్ని నియమించి వారి బాధ్యతతో అనుమతులిస్తాం. 20% పరిశ్రమలకు ప్రభుత్వం నిర్దిష్ట కాలపరిమితిలోపు రియల్‌టైమ్‌లో అనుమతులు ఇస్తుంది. పరిశ్రమ పెట్టడానికి ఇకపై కాళ్లరిగేలా తిరిగే పరిస్థితి ఉండదు' అని స్పష్టం చేశారు.

31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ముగింపు కార్యక్రమంలో, అనంతరం విలేకరుల సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. 'భాగస్వామ్య సదస్సు, ప్రాంతీయ సమావేశాల ద్వారా రూ.9.89లక్షల కోట్ల పెట్టుబడులకు 303 అవగాహన ఒప్పందాలు చేసుకున్నాం. కియా పెనుకొండలో 2 బిలియన్ డాలర్ల విస్తరణను ప్రతిపాదించింది. రిలయన్స్ రూ.2.73 లక్షల కోట్ల ఎంవోయూపై సంతకం చేసింది. హీరో మోటార్స్, ఐటీసీ పీ4లో చేరాయి. 2024 జూన్ నుంచి ఆంధ్రప్రదేశ్ రూ.32.49 లక్షల కోట్ల పెట్టుబడులను పైప్‌లైన్ చేసింది. ఇది దేశంలోనే అత్యధికం. తిరుపతిని గ్లోబల్ డిజైన్‌హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం.



మొదటిదశలో 5,000 ఎకరాలు కేటాయించి ఐఐటీలు, కేంద్రంతో కలిసి పనిచేస్తాం.

రష్యాకు చెందిన 'రుసల్' సంస్థ అల్యూమినియం ప్లాంటు ఏర్పాటుకు ఆసక్తిగా ఉంది. వచ్చే ఏడాది నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖ భాగస్వామ్య సదస్సుకు కుటుంబంతో వచ్చేందుకు మీ క్యాలెండర్లలో తేదీల్ని రిజర్వు చేసుకోండి. కుటుంబంతో అరకులోయ వెళ్లి అరకు కాఫీ ఆస్వాదిద్దాం. 2 రోజుల సదస్సుతో పాటు 3 రోజుల పర్యాటక ప్యాకేజీ అందించే ఆలోచన చేస్తున్నాం' అని చెప్పారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో పెట్టుబడుల రక్షణ చట్టాన్ని తీసుకొస్తామని తెపారు. వివరాలు ఆయన మాటల్లో..కొందరు ఎగతాళి చేస్తున్నారు : తిరుపతిలో స్పేస్‌సిటీ పెట్టాక చాలామంది ఆసక్తికరమైన ప్రణాళికలు చెబుతున్నారు. అంతరిక్షంలోనే డేటాసెంటర్ పెట్టి, దానిద్వారా డేటా అందించే ప్రణాళిక ఒకరు చెప్పారు. అంతరిక్షం నుంచి భూమి కంటే 7-8 రెట్లు ఎక్కువ సౌరశక్తిని గ్రహించి లేజర్ టెక్నాలజీ ద్వారా ఇంటికి చేరవేసేలా పరిశోధనలు జరుగుతున్నాయి. సూర్యుడు 24 గంటలూ ఏదో ఒక జోన్‌లో ప్రకాశిస్తూనే ఉంటాడు కాబట్టి, అక్కడి నుంచి కాంతిని తీసుకొని అవసరమైన చోటికి అందిస్తామంటే కొందరు ఎగతాళి చేస్తున్నారు. వీళ్లను ఏమనాలో అర్థం కాదు.తుపాను ప్రభావంపై ఇటీవల హెచ్చరికలు చేస్తే కాకినాడలో ఒకరు ఎగతాళి చేస్తూ 'ఈ ప్రభుత్వానికి ఏమీ తెలియదు. తుపాను వస్తుందని సెలవు ప్రకటించారు. తుపాను ఎక్కడ, ఎప్పుడు వస్తుంది? ఎండ కాస్తోంది' అని వీడియో పెట్టారు. సరిగ్గా అదేరోజు రాత్రి 10.30 గంటలకు అతలాకుతలం చేసింది. విమర్శలు చేసినవారి నోరు మూతపడింది. తెల్లారేసరికి ఆకాశం నిర్మలమైంది. మూడు రోజులకు మరో తుపాను వచ్చింది. అకస్మాత్తుగా 28 సెం.మీ. వర్షం కురిసింది. తర్వాత మళ్లీ ఎండ కాసింది. సాంకేతికత విషయంలో అర్థం కాకపోతే నేర్చుకోవాలి.

విశాఖ సీఐఐ సదస్సులో ప్రముఖ సినీనటుడు రానా దగ్గుబాటి నిర్వహించిన పాడ్‌కాస్ట్‌కు మంత్రి లోకేశ్ హాజరయ్యారు.

అమరావతి:'భవిష్యత్తులో అతిపెద్ద అవకాశాల్లో క్రియేటర్ ఎకానమీ ఒకటి. సినిమాలు, యూట్యూబ్, గేమింగ్ అన్నీ ఇందులో భాగమే. మా అబ్బాయి దేవాన్ష్‌కు కూడా సొంత యూట్యూబ్ ఛానల్ ఉంది. చాలామంది విద్యార్థుల్లోనూ సృజనాత్మకత ఉంటుంది. సెల్‌ఫోన్‌తోనే వీడియోలు రూపొందించే సాంకేతికత వచ్చేసిన తరుణంలో విశాఖపట్నంలో సినిమా, క్రియేటర్ ఎకానమీ అభివృద్ధికి సహకారం అందిస్తామ'ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు.హైదరాబాద్‌లో నిర్మాతలు, దర్శకులకు స్థలాలు కేటాయించి స్టూడియోలు నిర్మించుకునేలా ప్రోత్సహించడంతో షూటింగ్ నుంచి పోస్ట్ ప్రొడక్షన్ వరకు అన్నిరకాల సదుపాయాలు ఏర్పడ్డాయని, ఏపీలోనూ అలాంటి వసతులు ఒకేచోట సమకూర్చాలని అభిప్రాయపడ్డారు. విశాఖలో శుక్రవారం సీఐఐ భాగస్వామ్య సదస్సులో 'ది పవర్ ఆఫ్ పాసిబిలిటీ: బిల్డింగ్ పార్ట్‌నర్‌షిప్స్, క్రియేటింగ్ ది ఫ్యూచర్' అనే అంశంపై ప్రముఖ సినీనటుడు రానా దగ్గుబాటి నిర్వహించిన



పాడ్‌కాస్ట్‌కు మంత్రి లోకేశ్ హాజరయ్యారు. వివిధ అంశాలపై లోకేశ్ ఏమన్నారంటే.యువత రాజకీయాల్లోకి రావాలి : 'సినిమా, సంగీతం, యానిమేషన్, గేమింగ్ రంగాల్లో యువతకు శిక్షణ ఇచ్చేందుకు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ నెలకొల్పాలనుకుంటున్నాం. సంగీత దర్శకులు, సినీరంగ అనుభవజ్ఞులతో శిక్షణ ఇస్తాం. థమన్‌తో కలిసి పనిచేయాలి అనుకుంటున్నాం. తిరుపతిలోనూ ఓ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటుచేసే యోచన ఉంది. ఏఐ సాంకేతికత వాడకాన్ని పెంచుతాం. వినోద రంగంలో కొత్త అవకాశాలు సృష్టిస్తాం. యువత రాజకీయాల్లోకి రావాలి. ఇటీవలి ఎన్నికల్లో విశాఖ సహా చాలాచోట్ల యువత మేయర్లుగా, మున్సిపల్ ఛైర్‌పర్సన్లుగా గెలిచారు.మా మంత్రివర్గం 25 మందిలో 17 మంది యువతే. వ్యవస్థలో లోపాలున్నాయని విమర్శించడం కాదు, వాటి పరిష్కార ప్రక్రియలో భాగస్వాములు కావాలి. సమస్య పరిష్కారమయ్యే వరకు అధికారులు, సంస్థలు, ప్రజాప్రతినిధులను కలుస్తూ పట్టుదలతో పనిచేయాలి. పెద్ద కలలు కనడంతో పాటు వాటిని సాధించేందుకు ప్రణాళికలు రూపొందించడం, ఉమ్మడి లక్ష్యాల కోసం కలిసి పనిచేయడం ద్వారా సమాజంలో మార్పు తేవొచ్చు.

ఎన్నికలను వాయిదా వేయించేందుకు జగన్ కుట్రలు పన్నారు: ఎంపీ కలిశెట్టి



అమరావతివైసీపీ అధినేత జగన్ పై విజయనగరం టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రౌడీ మూకలను ప్రోత్సహించి, అల్లర్లు సృష్టించడం ద్వారా ఎన్నికలను వాయిదా వేయించాలని జగన్ కుట్రలు పన్నారని ఆయన ఆరోపించారు. అమరావతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పెద్ద ఎత్తున దౌర్జన్యాలు, అక్రమాలు జరిగాయని ఎంపీ కలిశెట్టి పేర్కొన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో ఎన్నికలు ఎంతో ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని, దీనిని చూసి ప్రజలు హర్షిస్తున్నారని ఆయన చెప్పారు. ప్రజలు శాంతియుతంగా ఓటు హక్కు వినియోగించుకుంటుంటే, ఓర్వలేక ప్రత్యర్థి పార్టీ అలజడులు సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు.జగన్ బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చొని ఆంధ్రప్రదేశ్‌పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఎంపీ ఆరోపించారు. ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఇదే సమావేశంలో, విశాఖపట్నంలో సీఐఐ పెట్టుబడుల సదస్సు విజయవంతం కావడంపై ఎంపీ హర్షం వ్యక్తం చేశారు.

అనకాపల్లి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. మృతుల కుటుంబాలను పరామర్శించిన అనిత



అనకాపల్లి జిల్లా: ఎస్. రాయవరం మండలంలో శనివారం విషాదం చోటుచేసుకుంది. కొత్త పోలవరం గ్రామం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో గాయపడి విశాఖపట్నం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పరామర్శించారు.పోలీసుల సమాచారం ప్రకారం... ఎస్. రాయవరం మండలం గుర్రంపేట గ్రామానికి చెందిన ఆరుగురు యువకులు కారులో పోలవరం వెళ్లారు. సరదాగా గడిపి తిరిగి వస్తుండగా, కొత్త పోలవరం వద్ద కారు అతివేగం కారణంగా అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ తీవ్ర ప్రమాదంలో కురందాసు శ్రీను, కోర్ని శ్రీను అనే ఇద్దరు యువకులు ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో కురందాసు ప్రసాద్, బొట్టా సురేంద్ర, కురందాసు శివ, కురందాసు అశోక్ తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో నలుగురినీ అత్యవసర చికిత్స నిమిత్తం విశాఖపట్నంలోని ఆసుపత్రికి తరలించారు.విషయం తెలుసుకున్న హోం మంత్రి వంగలపూడి అనిత ఈరోజు ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ఎలాంటి లోటు లేకుండా అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని వైద్యులకు, అధికారులకు స్పష్టం చేశారు.

నామినేషన్ల సమయంలో ప్రత్యేక ఎస్కార్ట్ కావాలంటే కల్పిస్తాం

అమరావతి:ఇటీవల జరిగిన ఎన్నికల్లో పల్నాడు నుంచి రాయలసీమ వరకు కొన్ని గొడవలు జరిగాయని ఎస్ఈసీ అనిల్‌చంద్ర పునేఠా తెలిపారు. సమస్యాత్మక 12 జిల్లాల ఎస్పీలతో ప్రత్యేకంగా మాట్లాడామన్నారు. పంచాయతీ ఎన్నికల సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు సూచించారు. నామినేషన్ల సమర్పణకు ఎవరైనా ప్రత్యేక ఎస్కార్ట్ కావాలంటే కల్పిస్తామన్నారు. దాడి ముప్పు ఉందని ఎస్పీకి చెప్తే అభ్యర్థులకు ప్రత్యేక భద్రత కల్పిస్తారని స్పష్టం చేశారు.గ్రామ పంచాయతీ ఎన్నికలు, పెండింగ్‌లో ఉన్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలపై ఎస్ఈసీ అనిల్‌చంద్ర పునేఠా సమీక్ష నిర్వహించారు. తిరుపతి కలెక్టరేట్‌లో అధికారులతో ఎస్ఈసీ సమావేశమయ్యారు. ఈ సమావేశానికి 12 జిల్లాల పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల నిర్వహణపై అధికారులతో చర్చించారు.భేటీ అనంతరం ఎస్ఈసీ మీడియాతో మాట్లాడారు. "పంచాయతీరాజ్ శాఖలో నిన్న కొత్త జీవో జారీ



అయ్యింది. ఏకగ్రీవం అయిన గ్రామాలకు ప్రభుత్వం ప్రోత్సాహక నిధులు ఇస్తుంది. ఐదు వేల వరకు జనాభా ఉన్న గ్రామానికి రూ.15 లక్షల ప్రోత్సాహక నిధులు వస్తాయి. ఐదు వేల నుంచి పది వేల వరకు జనాభా ఉన్న గ్రామాలకు రూ.25 లక్షల నిధులు అందుతాయి. 15 నుంచి 20 శాతం గ్రామాల్లో ఏకగ్రీవ ఎన్నిక జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.ఈనెల 19న ఎంపీపీల ఎన్నిక ఉంటుంది. 20న జడ్పీ ఛైర్‌పర్సన్ల ఎన్నిక ఉంటుంది. జడ్పీ ఛైర్‌పర్సన్స్, ఎంపీపీల ఎన్నిక విధివిధానాలు ప్రకటించాం. పదవీప్రమాణస్వీకారం చేసిన నాటి నుంచే వారి పదవీకాలం ఐదేళ్లు ఉంటుంది. గ్రామపంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో జరగుతాయి. పంచాయతీ ఎన్నికల సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించాం.నామినేషన్ల దాఖలు సమయంలో ఎవరైనా ప్రత్యేక ఎస్కార్ట్ కావాలంటే కల్పిస్తాం. దాడి ముప్పు ఉందని ఎస్పీకి చెప్తే, అభ్యర్థులకు ప్రత్యేక ఎస్కార్ట్ కల్పిస్తారు. శాంతిభద్రతలు బాగుంటేనే, ఎన్నికల ప్రక్రియ అంతా సజావుగా సాగుతుంది. పోలీసు వ్యవస్థ అందరినీ సమానంగా చూడాలి. ఇప్పటివరకు అధికారులు, పోలీసు వ్యవస్థ నుంచి మంచి సహకారం అందింది" అని ఎస్ఈసీ అనిల్‌చంద్ర పునేఠా తెలిపారు.

"పంచాయతీరాజ్‌శాఖలో నిన్న కొత్త జీవో జారీ అయ్యింది. ఏకగ్రీవమైన గ్రామాలకు ప్రభుత్వం ప్రోత్సాహక నిధులు ఇస్తుంది. ఐదు వేల జనాభా గ్రామానికి రూ.15 లక్షలు ప్రోత్సాహక నిధులు. 5001 నుంచి 10 వేల వరకు జనాభా గ్రామానికి రూ.25 లక్షలు ప్రోత్సాహక నిధులు. 10 వేలకు పైగా జనాభా ఉండి ఏకగ్రీవమైన గ్రామాలకు రూ.50 లక్షలు. ఏకగ్రీవం ద్వారా వచ్చే నిధులతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవచ్చు. 15 నుంచి 20 శాతం గ్రామాల్లో ఏకగ్రీవ ఎన్నిక జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఏకగ్రీవాలు బలవంతంగా మాత్రం జరగొద్దు, అభ్యర్థిపై ఎలాంటి ఒత్తిడి చేయొద్దు.

Printed Published and Owned by Godishala Somaiah Published from H.No 15-76 (V&M)Medipally,(Dist) Medchal Malkajgiri - 500098. Printed at Sree Sesha Sai Enterprises,Plot no 19, IDA Balanagar, Hyderabad Editor: Godishala Somaiah,email: nhnews24@gmail.com ,ph : 9912580066 RNI APTEL/2012/45237